### తిరుపతి జనసేన, టిడిపి నేతల్లో
# అంతర్మథనం !
## ఆధిపత్యపోరులో నలిగిపోతున్నామంటూ ఆవేదన



ప్రభాతవార్త-తిరుపతి టౌన్:
తిరుపతి నియోజకవర్గంలో అధికార జనసేన ఎమ్మెల్యే వ్యవహారశైలితో కూటమి టిడిపి నేతలు విస్మయం చెందుతున్నారు. ఆయన తీరుపై అటు జనసేన ఇటు టిడిపిశ్రేణులు అంతర్మథనంలో ఉన్నారు. బయటినుండి వచ్చి ఇక్కడ పోటీచేసినా అధినేత మాటను శిరసావహించి కష్టపడి పనిచేసి గెలిపిస్తే ఆయన తన పాత వైసిపి శ్రేణులతో అంటకాగుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఆయన ఏకంగా మాజీ మంత్రి మని షిగానే తిరుపతిలో చర్చమొదలైంది. ఆయన అనుచరులకు కూడా ఎమ్మెల్యే తీరు మింగుడుపడటంలేదని అంటున్నారు. మొన్నటికి మొన్న నగరపాలకసంస్థ చేపట్టిన మున్సిపల్ కూరగాయల మార్కెట్ దుకాణాల పార్కింగ్, నగరంలో పార్కింగ్ ఫీజు వసూలు టెండర్లు కూడా వైసిపి అనుచరులకే దక్కేలా చేశారని టిడిపి, జనసేన శ్రేణులు మండి పడుతున్నాయి. ఇంకా ఆయన తన పాతపార్టీ వారిని మరచిపోలేదనే బాహాటంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. టిడిపిలో పార్టీయే ప్రాణంగా భావించి కార్యక్రమాల్లో పాల్గొంటున్నా,పార్టీ కేడర్ నేతలకు గుర్తింపు లేకపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2004 ఎన్నికల్లో టిడిపి ఓటమితో అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వంతో టిడిపి నేతలు,కార్యకర్తలు భయంతో పార్టీలో కొనసాగి ప్రాణాలకు తృజించి పార్టీయే ప్రాణసమానంగా పనిచేశామని ఇప్పుడు గుర్తుచేసుకుంటున్నారు. వరుసగా 2009 ఎన్నికల్లోనూ టిడిపి అధికారం చేజిక్కించు కోలేకపోయింది. ఆ పదిసంవత్సరాలు రాష్ట్రంలోనేగాక ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టిడిపి కేడర్ ఎన్నో అవమానాలు, కష్టాలు పడిందని అంటున్నారు. మళ్లీ 2014 ఎన్నికల్లో తెలుగుదేశం విజయకేతనంతో రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఏర్పాటైనా, ఇతర పార్టీలనుంచి వచ్చిన వారికి ప్రాధాన్యతనిచ్చారని ఆవేదన చెందారు. 2024 ఎన్నికల్లో తిరుపతిలో టిడిపి పోటీచేయాల్సి ఉన్నా కూటమి పార్టీల ఒప్పందంలో జనసేన పార్టీనుండి ఆరణి శ్రీనివాసులును అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించడంలో కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు కీలకంగా పనిచేశారు. అయితే ఇప్పుడు కనీసం తమను పట్టించుకోవడం లేదని పలువురు నేతలు అంతర్మథనం చెందుతున్నారు. కొందరు నేతల ఆదిపత్యపోరులో నలిగిపోతున్నామని చెబుతున్నారు. ఇప్పటికే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో తమ ఉనికి ఏమవుతుందనేది ఆందోళన చెందుతున్నారు. మరీ ఈ విషయంపై పలువురు కూటమి పార్టీల నేతలు తమ అధినేతలు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌కు విన్నవించుకునేందుకు సిద్దమవుతున్నారు.

# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



### స్వామివారి ఆశీస్సులతో
## అందరికీ మంచి జరగాలి
**తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ మౌర్య**

తిరుమల, జులై 25 ప్రభాతవార్తః కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని తిరుపతి మేయర్ డాక్టర్ ఆర్.శిరీష, తిరుపతి నూతన కమిషనర్ ఎన్.మౌర్య ఆకాంక్షించారు. గురువారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో వేర్వేరుగా శ్రీవారిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



శ్రీవారిని దర్శించుకున్న మేయర్ శిరీష, కమిషనర్ మౌర్య దంపతులు

# ట్రేడింగ్ యాప్ పేరుతో కుచ్చుటోపీ!

- -పలమనేరులోనే సుమారు 5వేల మంది బాధితులు
- -ఇప్పటిదాకా సుమారు రూ.30 కోట్లుగా అంచనా
- - మోసపోయిన వారిలో ప్రభుత్వ ఉద్యోగులు సైతం



డిఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు, పక్కన దాయ్ యాప్ చిత్రం

పలమనేరు, జూలై 25 ప్రభాతవార్త:
ట్రేడింగ్ యాప్ పేరులో పలమనేరు ప్రజలకు ఓ యాప్ నిర్వాహకులు కుచ్చుటోపీ పెట్టారు.ఒక్కసారి పెట్టుబడి పెడితే ప్రతి రోజు పెట్టిన పెట్టుబడిలో 10శాతం చెల్లిస్తామని చొప్పిన మాటలను నమ్మి కొందరు పెట్టుబడులు పెట్టి కొంత కాలం వారికి ఆ పెట్టుబడిపై ప్రతి రోజు 10శాతం నగదు వస్తుండడంతో ఒకరిని చూసి మరొకరు అంటు ఒకరితో ప్రారంభమైన పెట్టుబడుల పర్వం పలమనేరులోనే 5వేల మందికి చేరింది. ఆ యాప్ ఒక్కసారిగా నగదు చెల్లింపులు ఆపివేయడంతో పెట్టుబడులు పెట్టిన వారు ఆ యాప్‌లో చేర్పించిన వారిని ప్రశ్నించడం, వారు వారు చేరిపించిన మరొకరిని ప్రశ్నించడం అలా ఒక్కరి నుండి వేల మంది వారు ఆ యాప్‌లో మోసపోయామని తెలుసుకుని ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చిన సంఘటన పలమనేరులో చోటు చేసుకుంది. ఆన్‌లైన్‌లో పెట్టుబడికి అధిక వడ్డీలు వస్తాయని నమ్మి ఒక్కసారిగా పలమనేరు సుమారు 5వేల మందికి పైగా మోసపోయారు. నెల రోజులుగా పట్టణంలో కొంతమంది ఓ యాప్ ద్వారా ప్రతి రోజు పెట్టుబడిపై సుమారు 10శాతం నగదు పొందుతున్నామని తెలపడం, ఆ విషయం నమ్మి చాలామంది ఆ యాప్‌లో పెట్టుబడులు పెట్టారు. అయితే నెల రోజులుగా ప్రతి రోజు వారి పెట్టుబడికి తగిన నగదు వస్తుండేది.మూడు రోజుల క్రితం రూ.లక్ష పెట్టుబడి ద్వారా రూ.2లక్షలు 3రోజులలో పొందవచ్చని ఆ యాప్ ద్వారా సమాచారం రావడంతో ఒక్కసారిగా చాలామంది ఆ యాప్‌లో పెట్టుబడులు పెట్టారు.ఇలా ఇప్పటి వరకు రూ.30కోట్లకు పైగా ఆ యాప్‌లో పెట్టుబడి పెట్టినట్లు సమాచారం. తీరా ఈనెల 22 సోమవారం నుండి యాప్ పనిచేయకపోవడంతో బాధితులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.ఎవరి ద్వారా ఆ యాప్‌లో సభ్యులుగా చేరారో వారిని ప్రశ్నించడంతో వారికి సైతం ఆ యాప్ పనిచేయటం లేదని తెలపడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. మోసపోయిన వారిలో అవగాహన లేని ప్రజలతో పాటు పలు శాఖలలో పని చేస్తున్న ఉద్యోగులు సైతం ఉండడం గమనార్హం.

**మహిళలకు జరిగిన మోసంలో ఆర్‌పీల పాత్ర కీలకమా...!**
పలమనేరు పట్టణంలో ఆధిక శాఖ మహిళలు ఆ యాప్ ద్వారా మోసపోయారు.కొంత మంది ఆర్‌పిలు,గ్రూపు సభ్యుల సూచనలతో చాల మంది మహిళలు అప్పులు చేసి,వారి వద్ద ఉన్న బంగారును సైతం తాకట్టు పెట్టి ఆ యాప్‌లో పెట్టుబడులు పెట్టారు.అయితే తీరా ఆ యాప్ బోర్డు తిప్పేయడంతో ఆ మహిళలు పోలీసులను ఆశ్రయించారు. ఇప్పటి వరకు సుమారు 200లకు పైగా మహిళలు ఆ యాప్‌లో నగదు చెల్లించామని ఆర్‌పిలు,గ్రూపు సభ్యుల సూచన మేరకు చేపట్టామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 5వేల మందికి పైగా యాప్ ద్వారా మోసపోయినట్లు తెలిసింది. నిర్వాహకులు యాప్ లింక్‌ను ఆన్‌లైన్‌లో కొంత మందికి పంపి మోసంచేసినట్లుతెలిసింది.యాప్ కీలకవ్యక్తిని ఒక్కరుకూడా చూడలేదని తెలపడం గమనార్హం.

**నేరాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం: డిఎస్పీ విష్ణురఘువీర్**
ప్రజల ఆశలతో పలు ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నాయని తరచూ అటు పోలీసులు ఇటు పలు సంస్థలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నప్పటికి ప్రజలు తక్కువ సమయంలో అధిక ఆదాయం వస్తుందని ఇలాంటి యాప్‌ల ద్వారా మోస పోతున్నారని డిఎస్పీ విష్ణురఘువీర్ తెలిపారు. వందల సంఖ్యలో బాధితులు గురువారం స్థానిక డిఎస్పీ కార్యాలయం చేరుకుని ఆయనకు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా బాధితులతో ఆయన మాట్లాడుతూ తెలియని యాప్‌లలో తెలిసిన వ్యక్తులు నగదు చెల్లించి అధిక లాభం పొం దుతున్నారని ఎటువంటి అవగాహన లేకుండా ఆ యాప్‌లలో పెట్టుబడులు పెట్టడం సరికాదన్నారు. రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని,నేరానికి పాల్పడిన వారిని గుర్తించి తగుచర్యలు తీసుకుంటామని తెలిపారు.

## టిటిడి అదనపు ఈఓగా వెంకయ్యచౌదరి



తిరుమల,జులై 25 ప్రభాతవార్త
టిటిడి తిరుమల అదనపు ఈఓగా మరో కీలక ఐఆర్ఎస్ అధికారి సిహెచ్. వెంకయ్యాచౌదరి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనను కీలకపదవిలో నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. తిరుమల జెఈఓ పోస్టుకు ఐఎఎస్ అధికారి నియామకం అవసరం .కానీ రాష్ట్రంలోని ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం తిరుమల జఈఓ పోస్టును అదనపు ఈఓ పోస్టుగా కొనసాగిస్తూ ఆ స్థానంలో వెంకయ్యాచౌదరిని గురువారం నియమించింది.

# జల జీవన్ మిషన్ అమలులో వైకాపా సర్కారు విఫలం

**ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు**

చిత్తూరు, జులై 25 ప్రభాతవార్త:
రాష్ట్రంలో గతంలో అధికారంలో వున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలు అవుతున్న జలజీవన్ మిషన్ పథకం అమలు చేయడంలో ఘోరంగా విఫలం అయ్యిందని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో గురువారం జరిగిన పార్లమెంటు సమావేశాల్లో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు జలజీవన్ పథకం వివరాలను వెల్లడించాలని లోక్‌సభను కోరారు. రాష్ట్రంలోఈ పథకం అమలు చేయడంలో గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. జాతీయ స్థాయిలో 76 శాతం ప్రజలు ఈ పథకంను సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందారని, అయితే ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజల దాహార్తిని తీర్చడానికి సరైన చొరవ చూపలేకపోయారన్నారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో స్పీకర్ ఓంబిర్లా ఇచ్చిన అవకాశంను సద్వినియోగం చేసుకున్న ఎంపీ దగ్గుమళ్ళ ఎపిలో జలజీవన్ మిషన్ పథకంను అప్పటి పథకంను ఎంత వరకు సద్వినియోగం చేసుకుందివివరాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు మూడు కిలోమీటర్ల దూరం నడచి వెళ్ళి మంచినీరు తీసుకువచ్చే పరిస్థితి ఉందని, జలజీవన్ మిషన్ పథకంకు సంబంధించి ఆడిట్ ఎమైనా చేశారా! రాష్ట్రానికి జలజీవన్ పథకం కింద ఏ మేరకు నిధులు విడుదలయ్యాయి వివరాలను ఇవ్వాలని ఎంపీ కోరారు. కేంద్రం అందించే వివరాలను పరిశీలించిన అనంతరం తాను భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటానన్నారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి సమాధానం ఇస్తూ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో జలజీవన్ పథకం అమలు అవుతుందని, భవిష్యత్తులో సైతం ఎపిలో జలజీవన్ మిషన్ పథకంను కొనసాగించడానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని వెల్లడించారు.




లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో జలజీవన్ మిషన్ పథకం అమలుపై వివరాలు అడుగుతున్న ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.

### శాస్త్రోక్తంగా చెంగల్వరాయస్వామి
# ధ్వజారోహణం



కుమారస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, జూలై 25 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయస్వామి వార్షిక ఆడికృత్తిక మహోత్సవాల సందర్భంగా గురువారం ధ్వజారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, ప్రధానార్చకులు, అర్చకుల ఆధ్వర్యంలో ధ్వజారోహణ పూజా కార్యక్రమాలు కన్నుల పండువగాసాగాయి. శ్రీవల్లి దేవసేన సమేత శ్రీచెంగల్వరాయస్వామి ఉత్సవమూర్తికి దివ్యాలంకరణ చేసి కొలువుదీర్చారు.ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాధన్ సారథ్యంలో పూజా కార్యక్రమాలను ఆలయ సంప్రదాయం మేరకునిర్వహించారు. హోమాలు, కలశస్థాపన పూజలను నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్చారణలతో చెంగల్వరాయ స్వామి ఎదురుగా ధ్వజపతాక ముగ్గును తీర్చిదిద్ది ధ్వజారోహణ పూజలను వేదమంత్రోచ్చారణలతో శా స్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం హోమపూజలను జరిపి హోమగుండంలో పూజద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి గావించారు. అనంతరం కలశ ఉద్వాసన చేసి చెంగల్వరాయస్వామి మూలవిరాట్టుకు విశేషపూజలను జరిపి పూర్ణహారతి ఇచ్చారు. ఈ పూజా కార్యక్రమాల్లో డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎసి మల్లికార్జున్ ప్రసాద్,టెంపులుఇన్సెపెక్టర్ సుదర్శనం నాయుడు ప్రధానార్చకులు సం బంధం, కరుణాకర్ గురుకుల్ పూజలు నిర్వహించారు..వేద పండితులు అర్థగిరి,గోవిందు, అచ్చితా గురుకుల్, నిరంజన్ గురుకుల్,తేజ గురుకుల్, కార్తీక గురుకుల్, వేదమంత్రాలు పఠిస్తుండగా ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. సూపరింటెండెంట్‌లు. ఎఇఒ, ఆలయ ఇన్సెపెక్టర్లు, పిఆర్‌ఓలు పాల్గొన్నారు.

## మీ పరిధిలో అప్రమత్తంగా ఉండండి
### స్టేషన్‌లో బీట్‌బుక్‌ను, జిడి తనిఖీ చేసిన ఎస్పీ లంకెల




తిరుపతి టౌన్,జులై 25ప్రభాతవార్త:
తిరుపతి జిల్లావ్యాప్తంగా వివిధ పోలీసుస్టేషన్‌లలో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బంది బాధ్యతతో, అప్రమత్తంగా వ్యవహరించాలని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు నిర్దేశం చేశారు. స్టేషన్‌ల పరిధిలో నేరాల నియంత్రణ,శాంతిభద్రతల పరిరక్షణకు గట్టిగా పనిచేయాలని, సాయంత్రం వేళ విజువల్ పోలీసింగ్ అమలుచేయాలన్నారు. స్టేషన్‌లలో ఎంతమంది ఎస్‌ఐలు,కానిస్టేబుళ్ళు, హెడ్ కానిస్టేబుళ్ళు పనిచేస్తున్నారు. షిఫ్టులవారీగా ఎంతమంది విధుల్లో ఉంటున్నారు, ఎక్కడెక్కడ ఉన్నారనే విషయాలపై ఎస్పీ స్వయంగా జిడి రికార్డును, బీట్‌బుక్‌లను తనిఖీ చేయడంతో స్టేషన్‌లలో సిఐలకు మరింత బాధ్యత గుర్తుచేశారు. స్టేషన్ పరిధిలో, పరిసర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అనుమానితులను వెంటనే అదుపులోకి తీసుకుని విచారణ చేసి వారి పూర్వాపరాలను పరిశీలించాలన్నారు. భక్తులకు, యాత్రికులు,నగరవాసులకు పూర్తిభద్రత కల్పించడంలో పోలీసులు నిరంతరం అలెర్టుగా పనిచేయాలన్నారు. నగరంలోని అన్ని పోలీసుస్టేషన్‌లను గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ సుబ్బరాయుడు సెంట్రీ విధుల్లో ఉన్న మహిళా పోలీసులకు కొన్ని దిశనిర్దేశం చేశారు. రైల్వేస్టేషన్, ఆర్టీసి బస్టాండ్‌లను ఎస్పీ తనిఖీ చేసి భద్రతపై ఆరా తీశారు.

## ప్రారంభోత్సవాలు సరే.. నీటి వసతి ఏదీ..?



చిట్టమూరు, జూలై 25 ప్రభాతవార్త
చిట్టమూరు మండలంలో ఇటీవల అట్టహాసంగా ప్రారంభించిన ప్రభుత్వ భవనాలకు నీటి వసతి లేకపోవడంతో సచివాలయ సిబ్బంది పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరవపాలెం గ్రామంలో సచివాలయంతో పాటు విలేజి క్లినిక్, రైతు సేవా కేంద్రాలు ప్రారంభం కాగా, అలాగే చిట్టమూరులో రైతు సేవా కేంద్రం, ఈశ్వరవాకలో రైతుసేవా కేంద్రంతో పాటు గ్రామ సచివాలయాలు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ చేతులు మీదుగా అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అయితే ఈ కార్యాలయాల్లో ఉద్యోగులు ఎక్కువమంది పనిచేస్తుండటం, తాగునీటి, మరుగుదొడ్లకు నీటి వసతి లేకపోవడంతో కొందరు పాత సచివాలయాల్లోనే కాలం వెళ్లదీయక తప్పడం లేదు. ప్రభుత్వ భవనాలకు అనుసంధానంగా మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ కనీస మౌలిక వసతి అయిన నీటిని ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండటంతో పలు ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభోత్సవాలుగానే మిగిలిపోయాయే తప్ప అందులో సిబ్బంది పనిచేసేందుకు మక్కువ చూపకపోవడం గమనార్హం.

## అక్రమ మద్యం ధ్వంసం



చిత్తూరు, జులై 25 ప్రభాతవార్త:
చిత్తూరు వెస్ట్ సర్కిల్ పరిధిలో యాదమరి, గుడపాల, తవణంపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులకు పట్టుబడిన 27 లక్షల రూపాయల విలువ చేసే అక్రమ మద్యం, నాటు సారాను గురువారం చిత్తూరు డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రవిశంకర్‌రెడ్డి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిటెండెంట్ రవిల సమక్షంలో ధ్వంసం చేశారు. ఈ అక్రమ మద్యం, నాటుసారాను పోలీసులు యాదమరి మండలం పెరుమాళ్ళపల్లికి సమీపంలో గురువారం రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేశారు. ఇటీవల కాలంలో చిత్తూరు వెస్ట్ సర్కిల్ పరిధిలోని యాదమరి, తవణం పల్లి, గుడిపాల మండల పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు 116 కేసుల్లో అక్రమ మద్యంను పట్టుకున్నారు. ఇం దులో యాదమరి పోలీస్ స్టేషన్ పరిధిలో 40 కేసులు, తవణంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 08 కేసులు, గుడిపాల పోలీస్ స్టేషన్ పరిధిలో 68 కేసులు వున్నాయి. ఇందుకు సంబంధించి 3,240 లీటర్ల అక్రమ మద్యం, 1,258 లీటర్ల నాటుసారాను రోడ్డు రోలర్‌తో పోలీసులు తొక్కించి ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో యాదమరి ఎస్ఐ రామాంజనేయులు, తవణంపల్లి ఎస్ఐ అనిల్‌కుమార్, గుడిపాల ఎస్ఐ నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయానికి రూ.1.24 కోట్లు ఆదాయం



కాణిపాకంలో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

కాణిపాకం, జూలై 25 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 1.24 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. బుధవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఈఓ వెంకటేశు ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భంగా 17 రోజులకు గాను హుండీల ద్వారా 1,24,41,336 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 24 గ్రాముల బంగారు, 440 గ్రాముల గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 9,448 రూపాయలు ఆదాయంగా వచ్చింది. నిత్యాన్నదాన హుండీ ద్వారా 30,629 రూపాయలు ఆదాయంగా లబించింది. దీనితో పాటు 1,256 అమెరికా డాలర్లు, 6 మలేసియా రింగిట్స్, 20 ఆస్ట్రేలియా డాలర్లు, 4 సింగపూర్ డాలరు, 25 కెనడా డాలర్లు,15 యూరో కరెన్సీ, 20 యూఏఈ దినార్స్, 10 ఇంగ్లాండ్ ఫౌండ్స్ ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓలు రవీంద్రబాబు, ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, ధనుంజయ సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, బాలరంగస్వామి, మల్లిఖార్జున, హుండీ ఇన్స్‌పెక్టర్ సుబ్రమణ్యంనాయుడు, కాణిపాకం ఎస్‌బిఐ బ్యాంకు, ఆలయ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

# కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటాం
## నారా భువనేశ్వరి



సమావేశంలో ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి, హాజరైన ప్రజలు

శాంతిపురం, జూలై 25 ప్రభాతవార్త
కుప్పం నుంచి ఎనిమిదిసార్లు చంద్రబాబును గెలిపించి నాలుగుసార్లు ముఖ్యమంత్రి చేసిన కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటామని సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. గురువారం మండలంలోని సోమాపురం, కర్లగట్ట, బదుగుమాకులపల్లి గ్రామాల్లో ఆమె ప్రజలు, మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కుప్పం ప్రజలు లేకుంటే తాము లేమన్నారు. ఐదేళ్ల వైకాపా పాలనలో చంద్రబాబు, తమ కుటుంబం, తెదేపా కార్యకర్తలు, ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డామన్నారు. వారి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు.ప్రజా ప్రభుత్వంలో మహిళలు ధైర్యంగా ఉండవచ్చన్నారు. వైకాపా పాలనలో అన్ని శాఖలను దోచుకుతిన్నారని, నామమాత్రపు పథకాలు అందించి ప్రజలను మోసగించారన్నారు. జై జగన్ అనని కారణంగా నందం సుబ్బయ్య, తోట చంద్రయ్యల పీకలు కోసి చంపేశారన్నారు. పూతలపట్టులో హంసవేణి అనే మహిళ మంచినీరు అడిగితే ఆమె కళ్లను వైకాపా నేతలు పీకేశారన్నారు.తెదేపా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారని పేర్కొన్నారు.పేదలకు పట్టెడన్నం పెట్టే అన్న క్యాంటీన్లను వైకాపా ప్రభుత్వం మూసేసి పేదల పొట్ట కొట్టిందన్నారు.ఇలాంటి దారుణాలు చూసిన జనం 2024 ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని పేర్కొన్నారు. శాంతిపురం మండలంలో యాభై ఎకరాల్లో కృషివిజ్ఞాన కేంద్రం ఏర్పాటుచేయిస్తున్నారన్నారు.కుప్పంలో పరిశ్రమలు, విమానాశ్రయం తదితర అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఈసందర్భంగా స్త్రీనిధి కింద మఠం పంచా యతీలోని 137మంది మహిళలకు స్వయంఉపాధికై 1.10కోట్ల చెక్కును డ్వాక్రా మహిళలకు అందించారు.

**భువనమ్మ సంకల్పం గర్వకారణం - ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్**
కుప్పం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని నారా భువనమ్మ సంకల్పించడం గర్వకారణమని ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పం ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకునేందుకు భువనమ్మ ముందుకు రావడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు నారా భువనమ్మ సోమాపురంలో శ్రీ మునేశ్వరస్వామి ఆలయాని ్న సందర్శించారు. కార్యక్రమాల్లో ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రాష్ట్ర నేత డా॥ సురేష్‌బాబు, పరిశీలకుడు ఖాదర్‌బాషా, మండలపార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్దనరెడ్డి, ఉదయ్, నాగభూషణం రెడ్డి, మణి, నాగరాజు, ఎల్.జయరాంరెడ్డి, రమేష్, ఉయ్యాలజయరాంరెడ్డి,రాజు, అనసూయ, భాగ్యలక్ష్మి త్రిలోక్, సుగుణమ్మ, చంద్రకళ, రూప తదితరులు పాల్గొన్నారు.

## 27న రేవా రిసార్ట్‌లో జాబ్‌మేళా

పాలసముద్రం, జులై 25 ప్రభాతవార్త:

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆధ్వర్యంలో అమరరాజా బ్యాటరీస్ సంస్థ మండలంలోని కృష్ణజిమ్మాపురం పంచాయతీ రేవా రిసార్ట్‌లో ఈ నెల 27వ తేదీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర తెలుగుదేశం కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు గురువారం తెలిపారు. జిడినెల్లూరు నియోజకవర్గ పరిధిలో అర్హులైన టెన్త్ క్లాస్ నుండి ఇతర ఉన్నత చదువులు చదువుకున్న యువతీ యువకులు తమ విద్యార్హతల సర్టిఫికేట్లతో ఈ జాబ్ మేళాకు హాజరు కావచ్చునన్నారు. ఉదయం 8 గంటల నుండి ఈ జాబ్ మేళా రేవా రిసార్ట్‌లో ప్రారంభం కానుందని, జాబ్‌మేళాకు హాజరయ్యే యువతీ యువకులు ఒరిజినల్ విద్యార్హతలతో పాటు జెరాక్స్ కాపీలను సైతం తీసుకురావాల్సి వుంటుందన్నారు.

## చెట్టుపడి కూలిన విద్యుత్ స్తంభం

పాలసముద్రం, జులై 25 ప్రభాతవార్త:



ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలోని నేరేడు చెట్టు గురువారం ఒక్కసారిగా విద్యుత్ స్తంభంపై కూలి విరిగిపోయింది. దీంతో చెట్టు కొమ్మతో పా టు విద్యుత్ స్తంభం నేలమట్టం అయ్యింది. విద్యుత్ స్తంభంపై చెట్టు కూలడం ఆ సమయం లో ఆ ప్రదేశంలో ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదంతప్పింది. ఎంపిడిఓకార్యాలయం ఆవం ˇణ లో మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఒ క్కసారిగా పెద్దగాలి వీయడంతో నేరేడు చెట్టు ప్రక్కనే వున్న విద్యుత్ స్తంభంపై కూలింది. చెట్టు విద్యుత్ స్తంభంపై కూలడంతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఎంపిడిఓ కార్యాలయట్రాన్స్ కో అధికారులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి వచ్చి విద్యుత్ సరఫరాను పునరుద్ద రించారు.

## పక్కాగా అంగన్‌వాడీల విధులు

పాలసముద్రం, జులై 25 ప్రభాతవార్త:



అంగన్‌వాడీ కార్యకర్తలు పక్కాగా విధులు నిర్వర్తించి చిన్న పిల్లల బాగోగులు చూసుకోవాలని ఎంపిడిఓ రామనాథరెడ్డి పేర్కొన్నారు. ఎంపిడిఓ రామనాథరెడ్డి గురువారం సింహ పురం, గంగమాంబపురం అంగన్‌వాడీ కేంద్రాలను అకస్మి కంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లా డుతూ అంగన్‌వాడీల ద్వారా గర్భిణీ స్త్రీలు, బాలింతలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలన్నారు. అలాగే అంగన్‌వాడికి వచ్చే పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారం ఇవ్వాలన్నారు. పిల్లలకు ఆటపాటలతో బోధన చేయాలని సూచించారు.

## ప్రదర్శనలో లేగదూడల పై అవగాహన

వాకాడు, జులై 25, ప్రభాతవార్త

లేగదూడలే పాడి పశువులని, ఉమ్మడి నెల్లూరు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ టి. సోమయ్య అన్నారు. గురువారం వాకాడు మండలం కొండాపురం గ్రామంలోని రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో నిర్వహించిన జాతీయ కృత్రిమ గర్భాదారణ, లేగదూడల ప్రదర్శన జరిగింది. ఈసందర్భంగా డాక్టర్ సోమయ్య మాట్లాడుతూ మండలంలోని 52 మంది పాడి రైతులు వివిధ జాతులకు చెందిన లేగదూడలను ప్రదర్శనకి తీసుకువచ్చారన్నారు. పౌష్టికలో తీసుకోవాల్సిన మెళుకువలు, పెయ్యి దూడల ఉత్పత్తి, పిండి మార్పిడిలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. లేగదూడలకు సులిపురుగుల మందు త్రాగించి, రైతులకు ఉచితంగా, మందులు, కాల్షియం టానిక్‌లు అందజేశారు. వివిధ జాతుల లేగదూడల పోషణలో మంచి ఫలితాలు సాధించిన ఉమ్మడి పుల్లయ్య, ఆవుల వెంకటకృష్ణయ్య, గుజ్జల పూడి మురళి అనే రైతులను అభినందించి ప్రోత్సాహ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వాకాడు టిడిపి మండల కన్వీనర్ మధుసూధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, సుధాకర్ నాయుడు, మోహన్ నాయుడు, వేణు నాయుడు, గోపి నాయుడు, వాకాడు పశువైద్యశాల ఏడీ రమణయ్య, వైద్యడు శివరామకృష్ణ, టిడిపి నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్‌లో మిగిలిన సీట్లకు 31న స్పాట్ అడ్మిషన్లు

కుప్పంరూరల్, జులై 25 ప్రభాతవార్త

కుప్పంలోని డా॥ వైసి జేమ్స్ ఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్‌లో మిగిలిన సీట్లకు ఈనెల 31వతేదిన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా॥ జగన్నాథరావు తెలిపారు. పాలిసెట్ -2024లో ర్యాంకుకలిగి ఉండి సీటు పొందని వారు, అర్హత సాధించని వారు ఈస్పాట్ అడ్మిషన్లకు అర్హులన్నారు. ఆసక్తిగల విద్యార్థులు పూర్తి వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## గోతులుపడ్డ రోడ్డు.. అరకొరగా ప్యాచ్‌లతో సరి

పాకాల, జులై 25, ప్రభాతవార్త



పాకాల మండలం గుమ్మడి వారి ఇండ్లు, రైల్వే గేట్ నుంచి కొత్తపల్లి వరకు ఉన్న రోడ్డు గుంతలమయం కావడంతో వాహనదారులు పలు గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సత్వరం కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిందిగా స్థానికులు వాహనదారులు కోరుతున్నారు.

## సొంత ఇంటి నిర్మాణ పనులు పరిశీలించిన నారా భువనమ్మ

శాంతిపురం, జులై 25 ప్రభాతవార్త

కుప్పం పర్యటనలో భాగంగా సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి గురువారం మండలంలోని శివపురం వద్ద సొంత ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా పనుల గురించి కాంట్రాక్టరుతో చర్చించారు. సాధ్యమైనంత త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. పనులు వేగవంతం చేస్తామని కాంట్రాక్టర్ భువనమ్మకు వివరించారు. ఇంటి నిర్మాణంకు సంబంధించి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

తవణంపల్లె, జులై 25 ప్రభాతవార్త:



గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని బెంగుళూరు-తిరుపతి సిక్స్‌లేన్ రోడ్డు బహుదానది బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై అనిల్‌కుమార్ వివరాల మేరకు బెంగుళూరు-తిరుపతి సిక్స్‌లేన్ రోడ్డు బహుదానది బ్రిడ్జిపై ఈనెల 23న తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొంది. దీనితో అతనికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆవ్యక్తి బుధవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.

## జీవితాలను మార్చే ఆయుధం చదువు ఒక్కటే

చౌడేపల్లి, జులై 25 ప్రభాతవార్త



మానవ జీవితాలను మార్చే ఆయుధం చదువు ఒక్కటే నని తేదేపా మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) అన్నారు. మండలంలోని తెల్లనీళ్ళపల్లికి చెందిన " నేస్తం ఫౌండేషన్ "వ్యవస్థాపక అధ్యక్షుడు గువ్వల కేశవరెడ్డి ఆధ్వర్యంలో పరికిదొన క్లస్టర్‌లోగల 8పాఠశాలల్లోని విద్యార్థులకు రాతపుస్తకాలు, విద్యావుపయోగకర వస్తువుందించారు. సరస్వతీ కటాక్షముంటే లక్ష్మీ కటాక్షం సిద్ధిస్తుందనీ, తద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. ఇష్టపడి చదివి తల్లిదండ్రులు, పాఠశాలలకు మంచి పేరుతేవాలని ఆయన ఆకాంక్షించారు. ఎంఇఓ కేశవరెడ్డి, నేస్తం ఫౌండేషన్ సభ్యులు, నాగరాజరెడ్డి, కళ్యాణ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తేదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

– వ్యవసాయ శాఖ జెడి మురళీకృష్ణ

శ్రీరంగరాజపురం, జులై 25 ప్రభాతవార్త:



రైతులు ప్రకృతి వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ శాఖ జెడి మురళీకృష్ణ అన్నారు. మండల పరిధిలోని మంగుట గ్రామంలో గురువారం జరిగిన పొలంబడి కార్యక్రమంలో వ్యవసాయ జెడి మురళీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. రసాయన ఎరువులు అధికంగా వినియోగించడంతో దాని ప్రభావం పంట దిగుబడిపై పడుతుందని ఈ పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం చేసి అధిక పంట దిగుబడులు సాధించాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయంతో చేసే పంట దిగుబడితో మనిషి ఆరోగ్యం సైతం బాగుంటుందన్నారు. రైతులు రసాయనిక ఎరువులు తగ్గించి ప్రకృతిలో లభించే వేపగింజలు. పిండి కానుగ ఆకులు, సీతాఫలం లాంటి కషాయాలతో పాటు దేశవాలి గోమూత్రం, గోమయంతో తయారు చేసే మన జీవామృతం, ద్రువ జీవామృతం లాంటి వాడటం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని రైతులకు ఆయన సూచించారు. దీనివల్ల భూమిలో నత్రజని శాతం పెంపొందించవచ్చునన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయంలో ఆకులు, మట్టి ఎలా ఉపయోగించాలో రైతులకు ఆయన వివరించారు. అలాగే వేరుసెనగ, జొన్నలు, సజ్జలు, కొర్రలు, ఆముద పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి నర్మద, సచివాలయ వ్యవసాయ అసిస్టెంట్ చక్కనయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అర్ధగిరిని దర్శించుకున్న రాష్ట్ర హైకోర్టు జడ్జి

తవణంపల్లె, జూన్ 25 ప్రభాతవార్త:



ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి వారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ వి.సుజాత గురువారం కుటుంసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, సంజీవరాయని పుష్కరిణి తీర్థాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు సంపత్, నిరంజన్ శర్మ, చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి, స్థానిక ఎస్సై అనిల్‌కుమార్, చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డీఈఓచే పాఠశాలల ఆకస్మిక తనిఖీ

తవణంపల్లె, జులై 25 ప్రభాతవార్త:



మండలంలోని పలు పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈమేరకు మండలంలోని అరగొండ బాలురోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు పరిశుభ్రతతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. అనంతరం అరగొండ బాలికోన్నత పాఠశాలను సందర్శించి శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలను పరిశీలించారు. అలాగే అరగొండ అపోలో ఈషా విద్యామందిర్ పాఠశాలను తనిఖీ చేసి యూడైస్‌ను త్వరితగతిన పూరి చేయాలని ఆదేశించారు. డీఈఓ వెంటమండలవిద్యాశాఖాధికారులుహేమలత, త్యాగరాజులురెడ్డి, మెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఐరాల పంచాయతీ గ్రామసభ రసాభస

ఐరాల, జులై 25 ప్రభాతవార్త:



ఐరాల మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించి గురువారం జరిగిన గ్రామసభ రసాభసగా సాగింది. గ్రామ సర్పంచ్ ఆధ్యక్షతన స్థానిక సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గత వైకాపా పాలనలో మూడేళ్ళుగా గ్రామ పంచాయతీ నిధులు పెద్దఎత్తున దుర్వినియోగం అయ్యాయని, తప్పుడు బిల్లులు, అధిక కొటేషన్లతో సర్పంచ్ భర్త అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ జిల్లా బిజెపీ కిసాన్‌మోర్చా కార్యదర్శి అయిరాల రాజేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బిజెపీ, టీడీపీ నాయకులు గ్రామ సభ వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఐరాల గ్రామ పంచాయతీలో జరిగిన నిధుల వినియోగంపై ఆడిట్ నిర్వహించి అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తూ నిరసన వ్యక్తం చేయడంతో గ్రామ సభ రాసాబాసాగా తయారైంది.

## రైల్వే మంత్రి అనుమతితో తీరనున్న మంచినీటి కష్టాలు

*బిజెపి చంద్రగిరి ఇంచార్జి మేడసాని పురుషోత్తం నాయుడు*

పాకాల, జులై 25, ప్రభాతవార్త

పాకాల మండలంలో భారతీయ జనతా పార్టీ చంద్రగిరి ఇంచార్జి మేడసాని పురుషోత్తం నాయుడు పాకాల పంచాయితీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో పాకాల బొమ్మాయిగుంట నుంచి బాలాజీ నగర్, గుట్ట కింద ఇండ్లు, రాజీవ్ కాలనీ, కరీంతుల్లాబాద్, శ్రీనివాసపురంకు వాటర్ సప్లై పైప్ లైన్ రైల్వే వారి ప్రాంతం నుండి వెళ్లవల్సి ఉంది. దీని కోసం పర్మిషన్‌కి గత ప్రభుత్వం నాయకులు మూడు సంవత్సరాలుగా ప్రయత్నం చేసారని అయినా రైల్వే పర్మిషన్ రాలేదని, ఈ సమస్యకు సంబంధించి రైల్వే వారి నుండి అనుమతిని ఇప్పించాల్సిందిగా తమరికి పాకాల సర్పంచ్ కోరడం జరిగిందన్నారు. పంచాయితీ ప్రజల త్రాగునీటి అవసరాన్ని గుర్తించి వెంటనే రైల్వే శాఖ మంత్రి ఆశ్విన్ వైష్ణవ్ దృష్టికి తీసుకువెళ్తున్నారు. మంత్రి వెంటనే స్పందించి సత్వరమే అనుమతి మంజూరు చేయవల్సిందిగా రైల్వే బోర్డును ఆదేశించడం జరిగిందన్నారు. అందువల్ల ఎన్‌డిఏ కూటమి తరపున కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవకి ధన్యవాదాలు తెలియచేసు కుంటున్నామన్నారు. పాకాల సర్పంచ్ కస్తూరి, ఎన్‌డిఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## రైతులు అధిక దిగుబడులు సాధించాలి

– జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు

కోట, జులై 25 ప్రభాతవార్త



రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు పిలుపునిచ్చారు. గురువారం కోట మండలం ఊనుగుంటపాలెంలోని రైతు సేవా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం పొలాల్లో వరిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వేసిన వరి పొలాలకు తెగుళ్ల సోకి ఉన్నాయని, వ్యవసాయ అధికారిని సంప్రదించి తెగుళ్ల నివారణకు మందులు పిచికారి చేయాలని సూచించారు. అనంతరం కౌలు రైతులకు పంట సాగు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆయన వెంట నాయుడుపేట ఎడిఏ సుచేంద్రప్రసాద్, మండల వ్యవసాయ అధికారి నిరంజన్‌కుమార్, మండల విఏఎలు వెంకటేశ్వర్లు, రైతులు ఉన్నారు.

## టీడీపీ నేత నాయుడుకు సత్కారం

పెళ్లకూరు, జులై 25 ప్రభాతవార్త



పెళ్లకూరు మండలం రావెలపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, సూళ్లూరుపేట నియోజకవర్గ రైతు విభాగం ఉపాధ్యక్షులు కెవి నాయుడును కోలీస్ ట్రాక్టర్ షోరూం కంపెనీ యజమాని ఘనంగా సత్కరించారు. నాయుడుపేట పట్టణంలోని కెకె కల్యాణ్ సదన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి లక్కీడ్రా ద్వారా రావడంతో కంపెనీ యజమాని కెవి నాయుడును శాలువాతో సత్కరించి అభినందించారు. సత్కరించి బహుమతులు అందజేశారు.

## బీజామృతం తయారీపై సంఘమిత్ర విఓఏలకు అవగాహన

చిట్టమూరు, జులై 25 ప్రభాతవార్త



చిట్టమూరు సంఘమిత్ర కార్యాలయంలో బీజామృతంపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించారు. గురువారం కార్యాలయం ప్రాంగణంలో ఎపిఎం ఉమాదేవి అధ్యక్షతన సిబ్బంది సంఘమిత్ర విఓఎలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ఐసిఆర్‌పి గోపాలయ్య మాట్లాడుతూ విత్తనశుద్ధికి బీజామృతం అత్యంత శక్తివంతంగా పనిచేస్తుందన్నారు. బీజామృతం తయారీలో ఐదు లీటర్ల ఆవుమూత్రం, ఐదు కేజిల ఆవుపేడ, 20 లీటర్ల నీటిని కలిపి 50 పుట్టమట్టితో కలిపి బీజామృతాన్ని తయారు చేసుకోవచ్చని తెలిపారు. విఓఎలు అందరూ రైతులకు సైతం ఈ విషయాన్ని తెలియజేసి అవగాహన పెంచాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ఉమాదేవితో పాటు సిసిలు వెంకటమ్మ, అలివేలమ్మ, పద్మమ్మలతో పాటు చిట్టమూరు మండలంలోని 31 మంది విఓఎలు, చిట్టమూరు మండల యూనిట్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గోపాల్, షాజహాన్, మధు తదితరులు పాల్గొన్నారు.

## నెలాఖరులోపు రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తాం

– తిరుపతి డిఎఓ ప్రసాదరావు వెల్లడి

చిట్టమూరు, జులై 25 ప్రభాతవార్త

ఈ నెలాఖరులోపు రైతులందరికీ సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తామని తిరుపతి జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు చెప్పారు. గురువారం 'వార్త' దినపత్రికలో ప్రచురితమైన 'పచ్చిరొట్ట విత్తనాలు అందించి పుణ్యం కట్టుకోండి మహాప్రభో' అనే కథనానికి జిల్లా వ్యవసాయ అధికారులతో పాటు సబ్ డివిజన్ అధికారులు స్పందించారు. గురువారం కోట మండలం ఊనుగుంటపాలెం గ్రామంలో పర్యటించిన జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాల కొరత గత నెలరోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా ఏర్పడిందని, అయినప్పటికీ 50 శాతం రాయితీతో ప్రభుత్వం రైతులకు ఇస్తున్న విత్తనాలను అందుబాటులోకి తెస్తామని స్థానిక ఎడి సుచేంద్రప్రసాద్ సైతం తెలిపారు. విఏఓ మాటలు కార్యరూపం దాల్చితే ఆయనకు కృతజ్ఞతలు చెబుతామని మూడు మండలాల రైతులు ఈ సందర్భంగా తెలియజేశారు.

## రైతులు ఎరువులు, కలుపు మందులు వాడకం తగ్గించాలి

జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడిఏ భాస్కరయ్య

బాలాయపల్లి, జులై 25, ప్రభాతవార్త



సాగు భూములు ఆరోగ్యంగా ఉంటేనే పంటలలో అధిక దిగుబడి వస్తాయని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడిఏ భాస్కరయ్య తెలిపారు. బాలాయపల్లి మండలం ఊట్లపల్లిలో ఆత్మ సహకారంతో ప్రకృతి వ్యవసాయం పై ఆయన రైతలకు శిక్షణ ఇచ్చారు. అవసరానికి మించి భూములకు రైతులు రసాయనిక ఎరువులు, కలుపు మందులు వాడకం వలన భూములు జవజీవాలను కోల్పోతున్నాయని వివరించారు. దీని వలన భూములు నిర్జీవమై, మునుముందు సాగుకు పనికి రాకుండా పోతాయని అన్నారు. ఈ పరిస్థితుల నుండి గట్టెక్కడానికి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు చాలా ఉపయోగపడతాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో, భూమి, పంటలు, ప్రజలు, పర్యావరణం ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ఈ వాస్తవాన్ని గురించి రాష్ట్ర, జాతీయ ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. పంటల సాగులో ఆచరించాల్సిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, జీవామృతం, కషాయాల తయారీపై ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ విభాగం మాస్టర్ ట్రైనర్ మల్లికార్జున రైతులకు వివరించారు. జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏఓ వేణుగోపాల రావు వరి సాగులో చేపట్టవల్సిన మేలైన సాగు పద్ధతులు గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి శిరీషా నేల ఆరోగ్యాన్ని కాపాడుటకు వ్యవసాయ శాఖ చేపడుతున్న చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు గ్రామ సర్పంచి సుధాకర్ బాబు, వ్యవసాయ సహాయకులు సలీం, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ స్వర్ణలత పాల్గొన్నారు.

## కళలు సాంస్కృతిక కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన

ప్రధానోపాధ్యాయులు నారాయణ

వెంకటగిరి, జులై 25, ప్రభాతవార్త



శిక్ష సప్తహ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కళలు, సాంస్కృతిక అభివృద్ధి, వివిధ భాషల సంస్కృతిని తెలియజేసినట్లు ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఎం. నారాయణ తెలిపారు. విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేసి గేయాలను ఆలపించారు. శిక్ష సప్తహ్ కార్యక్రమంలో భాగంగా నాలుగు రోజుల నుండి విద్యార్థులకు పలు అంశాలపై వివరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్‌కె జాస్మిన్, ఎన్. హరిత, ఏ. పద్మావతి, ఏ. సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న విద్యార్థుల రంగు దుస్తుల ప్రదర్శన

ఏటీఎం గురవయ్య

వెంకటగిరి, జులై 25, ప్రభాతవార్త



వెంకటగిరి నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నర్సరీ ఎల్కేజీ యూకేజీ విద్యార్థుల మ్యాచింగ్ కలర్ డ్రెస్ ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుందని ఆ సంస్థల ఏజీఎం గురవయ్య తెలిపారు. నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చిన్నారులు రంగురంగుల దుస్తులు ధరించి ప్రదర్శిన నిర్వహించారు. విద్యార్థులకు రంగులు పట్ల అవగాహన కల్పించినట్లు ఆయన చెప్పారు. అందరూ ఒకే రంగు దుస్తులు ధరించి ఒకే కుటుంబం అన్న విధంగా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కల్చరల్ ప్రిన్సిపాల్ రియాజ్, పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్, జోనల్ కోఆర్డినేటర్ పుష్ప, ఏవో మల్లికార్జున, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కళాశాలల్లోని సమస్యలు పరిష్కరించాలి

ఏఐఎస్ఎఫ్

వెంకటగిరి, జులై 25, ప్రభాతవార్త



కళాశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని విశ్వదయ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్ర బాబుకు ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. కళాశాలలో ఉన్న సమస్యల వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు ఏఐఎస్ఎఫ్ నాయకుడు యువరాజ్ తెలిపారు. పలు సమస్యలను వినతి పత్రం ద్వారా ప్రిన్సిపాల్‌కు అందజేశారు. వినతి పత్రాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తారని ప్రిన్సిపాల్ రవీందర్ బాబు తెలిపారు.

## హెల్మెట్ ధరించి ప్రమాదాల నుండి ప్రాణాలు కాపాడుకోండి

సిఐ సంగమేశ్వర రావు

వెంకటగిరి, జులై 25, ప్రభాతవార్త



ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని సిఐ సంగమేశ్వర రావు కోరారు. హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనం నడిపితే ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలు కాపాడుకోవచ్చని సూచించారు. హెల్మెట్ లేని వారి వాహనం ప్రమాదం గురైతే వాహనదారుడు ప్రాణం పోయే అందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కనుక హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని కోరారు. అతివేగం కూడా మంచిది కాదని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది రెంటాల వాసు విద్యార్థులు పాల్గొన్నారు.

## అండగుండలలో ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా

తడ, జులై 25 ప్రభాతవార్త



ఒకవైపు వర్షాలు కురుస్తున్నప్పటికీ మరో వైపు తడ మండలంలోని పలు గ్రామాల్లో మంచినీటి సమస్య తీవ్రమయింది. కొన్ని చోట్ల పథకాలు పనిచేయక పోవడంతో గ్రామీణులు దాహంతో విలవిల్లాడుతున్నారు. మండల పరిధిలోని అండగుండలలోను ఇదే పరిస్థితి నెలకొనడంతో గ్రామస్థులు మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపిడిఓ నెల్లూరు విజయకుమార్ స్పందించి గురువారం ట్యాంకరు ద్వారా నీటిని అందించారు. అక్కడ పనిచేయని పంచాయతీ బోర్లను మరమ్మతులు చేయిస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లోను సమస్యను పరిష్కరిస్తామని, సక్రమంగా మంచినీటిని ఇవ్వలేకపోతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని ఎంపిడిఓ చెప్పారు. ఇదిలావుంటే మండల పరిషత్ అధికారులే కాకుండా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు కూడా తాగునీటి సమస్య లేకుండా ఉండేందుకు చొరవ చూపించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## బాల్య వివాహాలపై అవగాహన

గూడూరు, జులై 25, ప్రభాతవార్త



గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరులోని ఎంపియుపి పాఠశాలలో అంగన్‌వాడి కార్యకర్తలు బేటి బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగం గా బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వై జర్ శివజ్యోతి మాట్లాడుతూ బాలికలను రక్షిం చడం అందరి బాధ్యత అన్నారు. అనంతరం విద్యార్థినులను గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించారు. బాలికలు రక్షణ పొందేందుకు చైల్డ్ హెల్ప్ లైన్ 1098ను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రమణమ్మ, భువనేశ్వరి, లక్ష్మీ, పావని, పాఠశాల హెచ్‌ఎం సిద్దయ్య, విజయలక్ష్మిపాల్గొన్నారు.

## విద్యార్థులకు గొడుగులు పంపిణీ

గూడూరు, జులై 25, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నరసింగరావు పేట బాలసదన్‌లో విద్యార్థులకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని దాతగా రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు అశోక్ చక్రవర్తి వ్యవహరించారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు అశోక్ చక్రవర్తి రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బాల సదన్‌లో సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయం అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో పిడిజీ కె. మునిగిరీష్, పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ రొటేరియన్ దశరథరామిరెడ్డి పాస్ట్ ప్రెసిడెంట్స్ పివి కృష్ణయ్య రాజు, చక్రవర్తి, రవీంద్ర రెడ్డి, సురేష్ రెడ్డి, రాంప్రసాద్, జగదీష్ నాయుడు, బలరాం రెడ్డి, బాలసదన్ మేనేజర్ అరుణ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మరింతగా సేవ చేసే భాగ్యం కలగాలి



సమాజసేవలో ,పేదలకు తనవంతుగా సాయమందిస్తూ పేదలపక్షపాతిగా మారిన డాక్టర్ పిసి రాయలు మరింతగా సేవచేసే భాగ్యం కలగాలని రాయలసీమ రంగస్థలి ఆకాంక్షించింది. గురువారం ఆయనను గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభాతవార్త-తిరుపతి

## కూటమిలోకి వైసిపి నేతలు రావొద్దు

-చేర్చుకోరాదంటూ టిడిపి తీర్మానం

తిరుపతి,జులై 25ప్రభాతవార్త:



తిరుపతిలో గత ఐదేళ్ళలో వైసిపి నేతలు, ద్వితీయశ్రేణి నాయకులు టిడిపి నేతలను ఇబ్బంది పెట్టడం, పలురకాలుగా వేధింపులకు గురిచేసిన ఘటనలతో ఇప్పుడు కూటమి పార్టీల్లోకి వైసిపి నేతలను రానీయకూడదని నిర్ణయించారు. టిడిపి లోకి అస్సలు చేర్చుకోబోమని, రానీయమని ఆమె తేల్చిచెప్పారు. వైసిపినేతలను కూటమి పార్టీలోకి రానీయొద్దని తీర్మానం చేశారు. నామినేటెడ్ పదవుల్లో కష్టపడి పనిచేసిన వారికి అవకాశం ఇస్తామని చెప్పారు. తిరుపతి టిడిపి నాయకులతో పలు అంశాలపై చర్చించారు.

## 30న మండల సర్వసభ్య సమావేశం : ఎంపిడిఓ

నారాయణవనం, జూలై 25 ప్రభాతవార్త :

నారాయణవనం మండల సర్వసభ్య సమావేశం ఈనెల 30వ తేది ఉదయం 10.30గంటలకు జరుగుతుందని ఎంపిడిఓ కృష్ణమూర్తి తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులందరు హాజరుకావాలని కోరారు.

## సిపిఎస్ ఉద్యోగులపై కేసులు ఎత్తివేత అభినందనీయం

-చీర్లకిరణ్



తిరుపతి,జులై 25ప్రభాతవార్త:

సిపిఎస్ ఉద్యోగులపై గత ప్రభుత్వం నమోదు చేసిన ఆందోళన కేసులను ఎత్తివేస్తూ ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం నిర్ణయంతీసుకోవడం అభినంద నీయమని టిటిడి ఉద్యోగుల అసోసియేషన్ నేత, సిపిఎస్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర్లకిరణ్ అన్నారు. అసెంబ్లీలో సిపిఎస్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు నిరసన తెలిపితే గత వైసిపి ప్రభుత్వం కేసు నమోదు చేయడం, ఉద్యోగులను ఇబ్బంది పెట్టడంతో ప్రస్తుతం ప్రభుత్వం ఆ కేసులను ఎత్తివేస్తూ తీసుకున్న నిర్ణయం హర్షణీయమని సిపిఎస్ నేతలు చీర్లకిరణ్, వంకీపురం పవన్, గుంటూరు రేఖ,మణికంత, సునీల్‌కుమార్‌యాదవ్ తదితరులు పేర్కొన్నారు.

## టైక్వాండోలో గోల్డ్ మెడల్ సాధించిన పి. భవ్య

తిరుపతి విద్య, జులై 25, ప్రభాతవార్త



బెంగళూరులోని విద్యారణ్యపురంలో జరిగిన సౌత్ జోన్ టైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపిసి విద్యార్థిని పి. భవ్య సీనియర్ కోరిగి బాలికల 58 కేజీ విభాగంలో బంగారు పతకం, ఫోమ్ సి ఇండివిజువల్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు భవ్యని అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మిగతా విద్యార్థినిలు కూడా చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలు మనిషిని కొత్త పుంతలు తొక్కించడంతో పాటు మనోరంజక సాధనలో కీలక పాత్రపోషిస్తాయని శారీరక దృఢత్వం, మానసిక వికాసానికి తోడ్పడుతాయి. కనుక విద్యార్థుల దైనందిన కార్యకలాపాలలో కొంత సమయం క్రీడలకు కేటాయిస్తే సమయ నిర్వహణ, క్రమశిక్షణను అలవరుస్తాయని, టిటిడి కల్పిస్తున్న అవకాశాల్ని అందిపుచ్చుకోవాలని విద్యార్థినిలను ఉద్దేశించి తెలియజేసి, శిక్షణనిచ్చిన పిడి సాయి సుమతిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పిఆర్ఓ మునీంద్రా ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి పొందే మహిళలకు ఇ - సైకిళ్లు

-పైలట్ ప్రాజెక్ట్‌గా కుప్పం ఎంపిక.. తొలివిడతలో 300మందికి రాయితీతో పంపిణీ !!

కుప్పం, జూలై 25 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం నియోజకవర్గంలో స్వయ ం ఉపాధి పొందే మహిళలకు రాయితీతో ఇ - సైకిళ్లను త్వరలో పంపిణీ చేయనున్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రవేశపెడుతున్న ఈకార్యక్రమంలో కుప్పం నియోజకవర్గాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. దీంతో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ద్వారా ఈ ఇ - సైకిళ్లను లబ్దిదారులకు పంపిణీ చేస్తారు. డ్వాక్రా మహిళా స ంఘాల్లో ఉంటూ చిరు వ్యాపారాలు, పాలు, ఇతర విక్రయాలు జరిపే మహిళలకు ఈ ఇ - సైకిళ్లను అందించనున్నారు. ఈ సైకిల్ ధర 40వేల రూపాయలు కాగా రాయితీతో 9వేల రూపాయలకు అందిస్తారు. ఈ ఇ- సైకిల్ చార్జింగ్ బ్యాటరీతో పనిచేయడంతో పాటు సుమారు నలభై కిలోల బరువును సైతం మోయగలుగుతుంది. ఒకవేళ సైకిల్ బ్యాటరీ చార్జ్ పూర్తయినా కాళ్లతో తొక్కుతూ ముందుకు సాగవచ్చు. కుప్పం నియోజకవర్గంలో తొలివిడతగా డ్వాక్రా మహిళలు 300మందికి ఈ ఇ - సైకిళ్లను పంపిణీ చేస్తారు. ఈమేరకు గురువారం ఇ - సైకిల్ సంస్థ ప్రతినిధులు కడ ప్రాజెక్ట్ అధికారి వికాస్ మర్మత్‌తో సమావేశమయ్యారు.

## ఘనంగా భారతీయ మద్దూర్ సంఘ ఆవిర్భావ దినోత్సవం

తిరుపతి హెల్త్, జులై 25, ప్రభాతవార్త

తిరుపతిలో సరస్వతి శిశు మందిర్‌లో భారతీయ మద్దూర్ సంఘ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఈఎస్ ఐసి డిప్యూటీ డైరెక్టర్ డి. రాధాకృష్ణ, ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యకారిణి సదస్సులు యుగంధర్ బిఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి బిల్లే శీనప్ప పాల్గొన్నారు. 70 ఏళ్లుగా బిఎంఎస్ కార్మిక సంక్షేమ మే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రకాంత్ డిఎంఆర్‌కెఎస్, ఎజిఎస్, పద్మనాభ రెడ్డి డిఎంఆర్‌కెఎస్ బ్రాంచ్ సెక్రటరీ, స్వర్ణ, తులసి రామ్, హేమారాణి, టిడిపి ఎంప్లాయిస్ అసోసియేషన్ స్విమ్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బిఎంఎస్ జిల్లా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్‌వి వైద్య కళాశాలలో 64వ వ్యవస్థాపక దినోత్సవం

తిరుపతి హెల్త్, జులై 25, ప్రభాతవార్త



తిరుపతి ఎస్‌వి వైద్య కళాశాలలో 64వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎస్‌వి వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ ఈ కళాశాలలో చదువుకున్న ప్రతి వైద్య విద్యార్థి దేశ విదేశాల్లో గొప్ప వైద్య సేవలు అందిస్తూ ఈ కళాశాలలకు ఎంతో వన్నె తెచ్చి పెట్టారని అన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ డే ప్రోగ్రాం ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శశికాంత్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పంపించిన సందేశాన్ని చదివి అందరికీ వినిపించారు. అందులో ముఖ్యంగా వైద్యానికి, వైద్య విద్యకు ఎనలేని సేవలు అందిస్తున్న వైద్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వైద్యానికి, వైద్య విద్యకు, వైద్య శాఖ మంత్రి పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో 1964 బ్యాచ్‌కి సంబంధించిన వైద్యాధికారులు డాక్టర్ ప్రేమానంద, ధూమపానం, శ్వాసకోస వ్యాధుల్లో వస్తున్న ఇబ్బందులు గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో వైద్యులకు, వైద్య విద్యార్థులకు, వైద్య సిబ్బందికి క్లుప్తంగా వివరించారు. అనంతరం వైద్య కళాశాల ప్రాంగణంలో వివిధ రకాలైన చెట్లను నాటారు. ఈ కార్యక్రమంలో రుయా ఆసుపత్రి ఇంచార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాధా, ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట్, డాక్టర్ డిఎస్ మూర్తి, ప్రసూతి వైద్య శాల సూపరింటెండెంట్ డాక్టర్ పార్ధసారధి రెడ్డి, డాక్టర్ శీనయ్య, డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ చలపతి రెడ్డి, డాక్టర్ హరిబాబు, డాక్టర్ శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ పాహీం, ఏపీ ఎన్జీవోస్ పట్టణ అధ్యక్షులు సురేష్ బాబు, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఏటుకూరి గిరిబాబు, జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్, వైద్యులు వైద్య విద్యార్థులు, వైద్య సిబ్బంది, ఎస్‌వి వైద్య కళాశాల పిఆర్ఓ వీరకిరణ్ పాల్గొన్నారు.

## జనసేన సభ్యత్వంతో పాటు జీవిత బీమా

తిరుపతి హెల్త్, జులై 25, ప్రభాతవవార్త

రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం తమ జనసేన పార్టీ వ్యవస్థాపకులు పవన్ కళ్యాణ్ నడుం బిగించి జనసేనపార్టీ సభ్యత్వం రూ. 500లతో తీసుకున్న ప్రతి ఒక్కరికి రూ.ఐదు లక్షల ప్రమాద జీవిత బీమాతో పాటు 50 వేల రూపాయిలు వైద్య ఖర్చులకు అందజేస్తారని తిరుపతి జనసేన పార్టీ ఇంచార్జి కిరణ్ రాయల్, రిటైర్డ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి సుమన్ రాయల్‌లు పిలుపునిచ్చారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో గురువారం మీడియాతో కిరణ్ మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో సభ్యత్వం చేసుకున్న జనసైనికులకు ఈ జీవిత బీమా ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ఈ నెల 28 వరకు కొనసాగుతుందని తెలియజేశారు. సమావేశంలో జనసేన నాయకులు మనోజ్, హేమంత్, షరీఫ్, పురుషోత్తం, సాయి, రాజేంద్ర, సిద్ధు, సాయిదేవ్, భాను తదితరులు పాల్గొన్నారు.

## సూచిక బోర్డులు బహూకరణ

శ్రీకాళహస్తి, జూలై 25 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి విశాఖ పట్టణానికి చెందిన ఓ ఫైబర్‌నెట్ సూచిక బోర్డులు,గేట్లును బహూకరిం చారు.గురువారం వారు సుమారు రూ.2లక్షల విలువ చేసే నాలుగు సూచిక బోర్డులను 10 బార్‌గేట్లను అందించారు. వీటిని దాతలు పరిపాలనా భవనాల వద్ద ఎసి మల్లికార్జున్ ప్రసాద్, డిఇఇ శ్రీనివాసులురెడ్డి ద్వారా అందజేసారు.

## ఆధార్‌కార్డు సేవలను సద్వినియోగం చేసుకోండి..ఎంపిపి

తొట్టంబేడు, జూలై 25 ప్రభాతవార్త



ఆధార్‌కార్డు సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి ఉన్నంనిర్మల, మండల వైకాపా సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవనాయుడులు తెలిపారు. ఆధార్ ప్రత్యేక క్యాంపు నిర్వహించడంలో భాగంగా గురువారం మండలంలోని పొయ్య పంచా యతీలోని సచివాలయంలో ఆధార్‌కార్డు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపిపి ఉన్నం నిర్మల మాట్లాడుతూ ఇప్పటికీ ఆధార్‌కార్డులు లేని వారు ఎంతో మంది ఉన్నారని వారికి ఇలాంటి క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతేకాకుండా తమ ఆధార్ కార్డులోని లోపాలను ఈ కేంద్రాల్లో సరిదిద్దుకోవచ్చని ఎంపిడిఓ తెలిపారు. ఈసందర్భంగా ఎంపిపి ఈనెల 27వ తేదీ వరకు ఆధార్ కేంద్రాల్లో బయోమెట్రిక్ అప్డేట్, డాక్యుమెంట్ అప్లోడ్ మరియు నూతన ఆధార్ కార్డుల నమోదు చేసుకొనుటకు ఆధార్‌క్యాంపులను ఏర్పాటు చేయమని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారని 0-5 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలు, ఐదు సంవత్సరాలు పైబడిన వారు బయోమెట్రిక్ అప్డేట్, డాక్యుమెంట్ అప్లోడ్, ఫోన్‌నంబర్ అనుసంధానం వంటివి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్రాంతి రాజేంద్రుడుకు శిక్షణా కార్యక్రమానికి ఆహ్వానం

తొట్టంబేడు, జూలై 25 ప్రభాతవార్త



పట్టణంలోని ఎస్వీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగాధిపతిగా పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొపెసర్‌గా పనిచేస్తున్న సంక్రాంతి రాజేంద్రుడుకు నాగార్జున యూనివర్సిటీలో జరిగే శిక్షణా కార్యక్రమానికి ఆహ్వానం పంపారు. రాష్ట్రంలో ఉన్న అన్ని డిగ్రీ కళాశాలల్లో జాతీయ విద్యావిధానం పాలసీ 2020ని అనుసరించి అకడమిక్ విద్యాసంవత్సరం 2024-25 మూడో సెమిస్టర్‌కు సంబందించి నూతన సిలబస్‌ను తయారు చేసింది. సింగిల్ మేజర్ స్ట్రీమ్ ప్యాటర్న్ విధానంలో భాగంగా సీక్, ఎస్‌ఈఎల్‌లను సర్టిఫికెట్ కోర్సుగా ప్రవేశపెట్టడం జరిగింది.ఇందుకు సంబందించి శిక్షణా కార్యక్రమాన్ని ఏపిసిసిఈ గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో శిక్షణ ఇవ్వనున్నారు. గతంలో ఈయన హైదరాబాదులోని సెంట్రల్ యూనివర్సిటీ మరియు సిసిఈ ఏపిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా రాజేంద్రుడును ప్రిన్సిపల్ శ్రీలత పలువురు అద్యాపకులు అభినందించారు.

## జనసేన ఆధ్వర్యంలో అన్నదానం

శ్రీకాళహస్తి, జూలై 25 ప్రభాతవార్త



పట్టణంలో డొక్కాసీతమ్మ స్ఫూర్తితో ప్రతి వారం జనసేన ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వ హించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి వినుత కోట ఆధ్వర్యంలో ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కాసీతమ్మ స్ఫూర్తితో స్థానిక ఆర్టీసి బస్టాండు వద్ద గురువారం జనసేన వీరమహిళలు ఆధ్వర్యంలో గాయత్రి, శార ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. డొక్కాసీతమ్మ అన్నదాన శిబిరం కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా జనసేన పార్టీ ఇన్‌ఛార్జి వినుత కోట చేతులమీదుగా ప్రారంభించి సుమారు 250మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రబాబు, నాయకులు, వీరమహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణి:

శ్రీకాళహస్తిరూరల్,జూలై 25 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలోని మారుమూల గ్రామమైన రామాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిరుపేద విద్యార్థులకు ఓ ఉపాధ్యాయుడు పాఠ్యపుస్తకాలను అందించారు.గురువారం ఆ పాఠశాలలో పని చేసే సాధుగిరి గత కొం త కాలంగా ఈ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నారు. ఈ పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రుల ఆర్థిక స్థితిని గుర్తించిన సాధుగిరి స్పందించారు. పేద విద్యార్థులకు చదువు చెప్పటమే కాకుండా వారు చదువుకునే పుస్తకాల్ని కూడా అందిస్తే రాణిస్తారని భావించి పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆయనకు మర్రిమంద దళితవాడకు చెందిన కల్లూరు రంగయ్య సహాకరిం చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు

శ్రీకాళహస్తిరూరల్, జూలై 25 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిమండలం రాచగున్నేరి పరిధిలోని చటర్జీనగర్‌లో సమస్యలు తిష్టవేసాయి.గత ఐదేళ్లుగా పంచాయతీకి నిధుల్లేక కనీసం మురుగు నీటి కాలువలు శుభ్రం చేసే పరిస్థితి లేదు.అలాగే రోడ్లు ధ్వంసమయ్యాయి. ముఖ్యంగా ట్రాన్స్ ఫార్మర్ దిమ్మె దెబ్బతిన్నది. వర్షాకాలం ఏ క్షణం ఏ జరుగుతుందో తెలియని ఆపాయకర పరిస్థితి. ఈ సమస్యను గుర్తించిన మాజీ సర్పంచ్, పారిశ్రామిక వేత్త బొల్లినేని జగన్నాధం నాయుడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బాగు చేయుటకు విద్యుత్‌శాఖలో అనుభవం ఉన్న ఎలక్ట్రిషియన్‌ను పిలిపించి ఆయనే దగ్గరుండి బాగు చేయించారు. కొత్త దిమ్మెను కట్టించి ప్రమాదాన్ని అరికట్టగల్గినారు. దాంతో గ్రామస్థులు ఆయన చొరవను అభినందించారు.

## బాధితుని పరామర్శించిన రిషితారెడ్డి

శ్రీకాళహస్తి,జూలై 25 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలోని కైలాసగిరి కాలనీలో నివాసముంటున్న పట్టణ పార్టీ అధ్యక్షురాలు సుమతి భర్త రవీంద్రనాయుడు అస్వస్థతకు గురై గుండె ఆపరేషన్ చేయించుకున్నారు.వారు ఇంటికి రాగా గురువారం శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి ఇంటికి వెళ్ళి పరామర్శించారు. ఏ కార్యకర్తకు అయినా ఇబ్బంది వస్తే ఆదుకోవటానికి తామున్నామని భరోసా ఇచ్చారు. రవీంద్రనాయుడుకు ధైర్యం చెప్పారు. రిషితారెడ్డితో పాటు మాజీ శ్రీకాళహస్తి పాలసరఫరా సంఘం అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు ఉన్నారు.

## నియోజకవర్గంలో ఆగిన పనులపై సిఎంకు నివేదిక

శ్రీకాళహస్తి, జూలై 25 ప్రభాతవార్త



అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునా యు డును ఆయన క్యాంపు కార్యాలయంలో శ్రీకాళ హస్తి నియోజకవర్గ ఎంఎల్ఏ బొజ్జలవెంక టసుధీర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలసి గత ఐదు సంవత్సరాల్లో వైసిపి ప్రభుత్వంలో నియోజకవర్గంలో ఆగిన అభివృద్ధి పనులకు సంబంధించి వివరాలు మరియు నియోజక వర్గంలో ఇచ్చిన హామీల అమలుకు నిధులు విడుదల చేయాలని సిఎంను కోరారు. దీనిపై సిఎం సానుకూలంగా స్పందించిన సిఎం శ్రీకాళహస్తి అభివృద్ధికి ఎన్నడూ ముందుంటానని తెలిపారు.

## హెల్మెట్ ధరించడం వల్లనే ప్రమాదాల నివారణ

శ్రీకాళహస్తి, జూలై 25 ప్రభాతవార్త



ద్విచక్రవాహనదారులు ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్లు ధరిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని డిఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్లకార్డు లతో గురువారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన డిఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి ద్విచక్రవాహనదారుడు విధిగా హెల్మెట్లు ధరించి తమవిలువైన ప్రాణాలను కాపాడుకోవాలని తెలిపారు. ర్యాలీలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, సరస్వతీబాయి పురపాలక సంఘం ఉన్నత పాఠశాల, బాబుఅగ్రహారం ఉన్నత పాఠశాలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టుకుని ర్యాలీ నిర్వహించారు. వాహనదారులు హెల్మెట్లను ధరించడం సామాజిక బాధ్యతగా గుర్తించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో భువనేశ్వరి, హెచ్‌ఎం రాజేశ్వరి, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయ కమిషనర్ టి.రమేష్‌బాబు, సహాయ కమిషనర్ పార్వతీ, యువత ఛైర్మన్ అజారుద్దీన్, మాస్టర్లు గోపాలకృష్ణ, వెంకటరమణ, యోగానందం, ధనుష్, సుబ్రమణ్యం, గైడ్ కెప్టెన్ పద్మావతి, నిర్మల, సరిత తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఇదీ రేణిగుంటలో రోడ్ల దుస్థితి...



రోడ్డు పక్కన కూరుకుపోయిన 108 అంబులెన్స్

రేణిగుంట, జూలై 25 ప్రభాతవార్త:

రోజు రోజుకు రోడ్ల పరిస్థితులు అధ్వానంగా మారుతున్నాయి. రోడ్లన్నీ ఇప్పటికే దాదాపు గుంతల మయంగా మారాయి. చిన్నపాటి వర్షానికి కూడా గుంతల్లో నీళ్లు నిలబడి వాహన చోదకులు, పాద చారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. గుంతలు నీటితో ఎంత లోతులో ఉన్నాయో అర్థం కాక ఎన్నోప్రమాదాలు జరిగి ఎంతో మంది క్షతగాత్రులవుతున్నారు. ఇంకొంత మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రజలు ఎన్ని శాపనార్థాలు పెట్టినా అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అలవాటైపోయిన ప్రాణాలు ఎవరు ఎలా పోతే మాకేంటి నీ ధోరణిలో వ్యవహరిస్తున్నారంటున్నారు. ప్రజాసేవ పక్కనపెట్టి ప్రభువులకు సేవ చేసుకుంటే తమ ఉద్యోగాలు పదిలమన్న విధంగా ఉన్నాయి వారి పద్ధతులు. రేణిగుంట భగత్‌సింగ్ కాలనీ వద్ద సర్వీసు రోడ్డు గుంతలమయంగా మారిపోయింది. కనీసం ప్యాచ్ వర్క్ చేసిన పాపాన పోలేదు. ఓ వైపు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మరో వైపు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అధికారులను ప్రజాసేవ చేయండయ్యా బాబు అంటే ఏదో అక్కడక్కడ మమ అని చేతులు దులుపుకుంటున్నారు. తాజాగా గురువారం భగత్‌సింగ్ కాలనీలో సర్వీస్ రోడ్డు మార్జిన్ వద్ద వర్షాలకు గుంతలు పడి మార్జిన్ మెత్తబడిపోయింది. ఇది తెలియని ఓ 108 అంబులెన్స్ టైరు మార్జిన్ వద్ద కిందకు జారి ఒక టైరు బురదలో కూరుకుపోయింది. అంబులెన్స్‌లో ఎలాంటి ప్రాణపాయ స్థితిలో ఉన్న వారు ఉన్నారో.. వారికి ఎలాంటి ఇబ్బందులు ఏర్పడ్డాయో అనుభవించిన వారికి తెలియాలి. అంబులెన్స్ సిబ్బంది కూరుకుపోయిన అంబులెన్స్ టైరును బయటకు తీయాలా..? అంబులెన్స్‌లో ఉన్న వారి ప్రాణాలు కాపాడాలా...? అధికారులకే తెలియాలి. పెద్ద ప్రమాదం జరుగుంటే 108 అంబులెన్స్ సిబ్బంది ఆస్పత్రికి తీసుకెళ్ళడానికి మరో 108 అంబులెన్స్ రావాల్సిన అవసరం దాపురించేది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సర్వీస్ రోడ్లు, జాతీయ రహదారులు, ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిల వద్ద చిన్న చిన్న మరమ్మతులు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన ఆవశ్యకత ఉంది.

## వ్యక్తి ఆత్మహత్య

వడమాలపేట, జూలై 25 ప్రభాతవార్త:

మండలంలోని అంజేరమ్మ కనుమ వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ ధర్మారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి సుమారు 55 నుంచి 60 సంవత్సరాల వయసు ఉంటుందని,నీలం రంగు లుంగీ, పక్కన ప్లాస్టిక్ సంచి తప్ప ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవన్నారు. ఆత్మహత్య చేసుకోవడానికి తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఉపాధి పనులతో రోడ్డు మరమ్మతు

వడమాలపేట, జూలై 25 ప్రభాతవార్త:



వడమాలపేట మేజర్ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం రోడ్డును ఉపాధి పనుల ద్వారా మరమ్మ తులు చేపట్టారు. జాతీయ రహదారి నుంచి లక్ష్మీపు రంకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ముళ్ళ పొదలతో రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. పాములతో ఎక్కువగా ఉండడంతో గ్రామస్థులు రాత్రి పూట వెళ్లేం దుకు భయపడే వారు. చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయలనాయుడు చొరవతో ఉపాధి పనుల్లో భాగంగా గురువారం రోడ్డుకిరువైపులా ఉన్న ముళ్ళ పొదలను తొలగించారు. తమ సొంత డబ్బుతో మట్టిని తొలి సెక్షన్ చేయించారు.

## శ్మశాన ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని వినతి

పుత్తూరురూరల్, జూలై 25 ప్రభాతవార్త:



తమకు శ్మశానానికి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించు కునేందుకు ప్రయత్నం చేస్తున్నారని అధికారులు స్పం దించి చర్యలు తీసుకోవాలని మజ్జిగ గుంటకు చెందిన గిరిజనులు గురువారం పుత్తూరు తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఎస్టీ కాలనీలో సుమారు 150 కుటుంబాల వారు నివాసం ఉంటున్నారని, శ్మశానం కోసం పలు మార్లు అధికారుల చుట్టూ తిరిగితే గతంలో 2018లో సర్వే చేసి సర్వే నెం.169/2లో 50 సెంట్లు స్థలాన్ని కేటాయించారన్నారు. అప్పటి నుంచి గిరిజనులు ఎవరైనా చనిపోతే శ్మశానంలోనే ఖననం చేస్తున్నామని, అయితే 24న బుధవారం కొందరు ఆక్రమణ దారులు జేసీబీతో ఆక్రమణ చేస్తున్నారని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.మజ్జిగ గుంట గిరిజనులు పాల్గొన్నారు.

## గ్రావెల్ మట్టి తరలించడానికి అధికారులు అత్యుత్సాహం

విజయపురం, జూలై 25 ప్రభాతవార్త:



మండలంలో గ్రావెల్ మట్టిని తమిళనాడుకు తరలించడానికి అటు మైనింగ్ అధికారులు, ఇటు తహసీల్దార్ కింది స్థాయి రెవెన్యూ సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని గ్రామసు లు ఆరోపిస్తున్నారు. ఎన్నికలు పూర్తయి ఫలితాలకు ముం దుగానే 16.5.2024న 60 రోజుల పాటు గ్రావెల్ తరలించు కోవడానికి మండలంలోని మహారాజపురం రెవెన్యూలో సర్వే నెం.1 పార్ట్ అంటూ తాత్కాలిక అనుమతి తీసుకోవని గ్రావెల్ తరలించడానికి ప్రయత్నాలు చేయడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మండలం నుంచి సహజ వనరులకు తరలించడానికి కుదరదని, ఎవరైనా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కానీ ఎలాగైనా గ్రావెల్ మట్టి తరలించి సొమ్ము చేసుకోవాలని తాత్కాలిక అనుమతి పెట్టుకుని పావులు కదుపుతున్నారని ఆరోపించారు. తహసీల్దార్‌కు ఎలాంటి సమాచారం లేకుండానే యంత్రాలను సిద్ధం చేయడంపై పలు అనుమానాలు ఉన్నాయని అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## గ్రీన్ అంబాసిడర్‌లకు పెండింగ్ జీతాలు చెల్లించాలి - ఏఐటీయూసీ

విజయపురం, జూలై 25 ప్రభాతవార్త:



మండలంలో గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన విజయపురంలో గురువారం ఏఐటీయూసీ కార్మిక అనుబంధ సంఘాల విస్తృత స్థాయి సమావేశం మండల అధ్యక్షుడు ఏసుపాదం అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ యూనియన్ జిల్లా వర్కింగ్ అధ్యక్షురాలు సుజాత, నాయకులు పరిమళ, లక్ష్మి, లత, షీబా, భావన, మునిలక్ష్మి, రవి, సుధాకర్, ఏళుమలై పాల్గొన్నారు.

## అన్నా క్యాంటీన్ నిర్మాణ పనులు ప్రారంభం

పుత్తూరు, జూలై 25 ప్రభాతవార్త :



పట్టణంలో అన్నా క్యాంటీన్ నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లోని సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ పక్కన క్యాంటీన్ నిర్మాణ పనులు పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యద ర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్. ఎన్.ధనపాల్ ఆధ్వర్యంలో జరుగుతు న్నాయి. ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ ఆదేశాల మేరకు మునిసిపల్ నిధులతో అన్నా క్యాంటీన్ నిర్మాణ పనులు ప్రారంభించామని, త్వరలోనే భూమి పూజ చేస్తామని వీరు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఆనంద్, టిడిపి నాయకులు బాబునాయుడు, మురళీకృష్ణ, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాలలో మాదకద్రవ్యాలు,

మహిళా రక్షణ పట్ల అవగాహన కార్యక్రమం

తిరుపతి విద్య, జులై 25, ప్రభాతవార్త



స్థానిక శ్రీ గోవిందరాజుస్వామి ఆర్ట్స్ కళాశాలలో గురువారం సెట్విన్ వారి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు, సాంకేతిక నేరాలు, మహిళా రక్షణ అను అంశాల పట్ల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి సెట్విన్ మేనేజర్ మోహన్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ చక్రి నాయక్ పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం వలన కలిగే అనర్థాలను సాంకేతిక నేరాలు పట్ల జాగ్రత్త వహించాలని మహిళా విద్యార్థులు వారి రక్షణ కోసం ఎలా ప్రవర్తించాలో చక్కగా వివరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ గిరిజ విద్యార్థులకు తమదైన శైలిలో చక్కని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పరమేశ్వర మహిళ శీటీం పూర్ణిమ, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్ధిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ పిసి రాయులు జన్మదిన వేడుకలు



అన్నదానం చేస్తున్న భాను ప్రకాష్ రెడ్డి

తిరుపతి విద్య, జులై 25 ప్రభాతవార్త : కస్తూరిబా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పిసి రాయులు జన్మదిన వేడుకలు గాంధీ రోడ్డులోని వారి కార్యాలయంలో గురువారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్రనాయకులు జి. భాను ప్రకాష్ రెడ్డి హాజరయ్యారు. మొదటిగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసి అనంతరం 750 మంది పేద ప్రజలకు అన్నదానం చేసారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి.సి రాయులు మాట్లాడుతూ గత 20 సంవత్సరంగా కస్తూరిబా గాంధీ కేంద్ర ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని విద్యార్థులకు, మహిళలకు, కాలేజీ పిల్లలకు పాఠశాల పిల్లలకు ముఖ్యంగా పేద బడుగుబలహీన వర్గాల వారికి అనేక రకాలుగా సహాయం అందించామని, కోవిడ్ సమయంలో అనేక మంది పేద వర్గాల వారికి వివిధ రాష్ట్రాలలో నుండి సొంత ఊర్లకు వెళ్లే సందర్భంలో ఆపన్నహస్తం అందించామని తెలియజేస్తూ ఉమ్మడి జిల్లా , రాయలసీమ జిల్లాల్లో అనేక ప్రాంతాలలో కార్యక్రమాలు నిర్వహించి పేద ప్రజానీకానికి సహాయ సహకారాలు అందించామని తెలియజేశారు. భవిష్యత్తులో ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలియజేశారు. భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో మంది మన ప్రాంతంలో ఉన్నప్పటికీ పిసి రాయులు వంటి గొప్ప సేవాభావం కలిగిన వ్యక్తి తిరుపతిలో ఉండడం మన అదృష్టమని 20 సంవత్సరాలుగా పిసి రాయులు మంచి మనసుతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి తద్వారా పేద ప్రజలకు అలాగే కళలను పోషిస్తూ కళాకారులకు తోడ్పాటును అందించారని తిరుపతిలోని అనేక సంస్థలకు సహాయ సహకారాలు అందిస్తూ చేస్తున్న వారి సేవ గుణానికి ధన్యవాదములు తెలియజేశారు. అనంతరం జన్మదినోత్సవ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం నిత్యాన్నదాన ట్రస్టుకు పది లక్షల రూపాయిలు విరాళంగా ఇవ్వడం జరిగింది. అక్కడ నుండి బైరాగి పట్టెడలో ఉన్న జాస్మిన్ వృద్ధాశ్రమం వృద్ధులకు స్థానిక పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బండి మధుసూధన్ రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, ఉమాపతి, షాబుద్దీన్, సుబ్రమణ్యం రెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కి అన్యాయం

**సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్**



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

గూడూరు, జులై 25 ప్రభాతవార్త : బిజెపి ప్రభుత్వం బడ్జెట్‌లో ఆంధ్రరాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేస్తూ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ని సిపిఎం దేశ వ్యాప్తంగా ఇచ్చినటువంటి పిలుపులో భాగంగా గూడూరులోని టవర్ క్లాక్ సెంటర్‌లో గురువారం నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, పి. శ్రీనివాసులు మాట్లాడుతూ అమరావతి రాజధాని నిర్మాణానికి 15000 కోట్ల అప్పు ప్రకటించడం దుర్మార్గం అన్నారు. దీన్ని గ్రాంట్‌గా ఇవ్వాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని, విభజన చట్టంలోని ప్రత్యేక హోదా గాలికి వదిలేసిందని పేర్కొన్నారు. ప్రత్యేక ప్యాకేజీ కాని నిధులు లేవు. కేవలం అప్పులతో సరిపెట్టిందని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ప్రత్యేక నిధుల కేటాయింపు లేదు అని, కడప స్టీల్ ప్యాక్టరీ, రామాయపట్నం ఓడరేవు, విశాఖపట్నం రైల్వే జోను ఊసే లేదని, విశాఖ స్టీలు ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటన లేదని, ప్రజా పంపిణీ వ్యవస్థ, ఆహార ధాన్యాలు, ఎరువులు, పెట్రోలు, డీజిలు, గ్యాస్ సబ్సిడీలపై కోత విధించడం దుర్మార్గం అన్నారు. ఇది ధరలు మరింత పెరగడానికి తోడ్పడుతుందన్నారు. నిత్యావసర వస్తువుల ధరల తగ్గింపు పై చర్యలు లేవు, అంగన్వాడీ, ఆశ, తదితర స్కీముల బడ్జెట్‌లో కోత విధించారని, ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు పెంచకపోవడం ఘోరం ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకం ద్వారా 50 వేల కోట్ల రూపాయిలు సేకరిస్తామని ప్రకటించడం మరింత ప్రైవేటీకరణకు పూనుకోవడమే ఇది సామాన్య ప్రజల వ్యతిరేక బడ్జెట్ ఊడిగం చేసే బడ్జెట్ అని తెలిపారు. రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వం కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి భజన చేయడం మానుకోని విభజన చట్టంలోని హామీలను అమలు జరిపేందుకు నిధులు రాబట్టేందుకు కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బివి రమణయ్య, ఎస్ సురేష్, పుట్టా శంకరయ్య, చంద్రయ్య, ఎస్‌కె మున్నా తదితరులు పాల్గొన్నారు.

## ఫైనల్‌కు చేరిన విశాఖపట్నం క్రికెట్ టీం

వెంకటగిరి, జులై 25 ప్రభాతవార్త : వెంకటగిరి తారకరామా క్రీడా ప్రాంగణంలో మూడు రోజుల నుండి జరిగిన అండర్ 16 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో విశాఖపట్నం జట్టు ఫైనల్స్‌కు చేరింది. విజయనగరం విశాఖపట్నం టీమ్‌ల మధ్య హోరాహోరీగా క్రికెట్ పోటీలు జరిగాయి. మూడో రోజు జరిగిన మ్యాచ్‌లో విశాఖపట్నం విజయం సాధించింది. విజయనగరం టీంకు చెందిన వాటికి 52 పరుగుల తీశారు. విశాఖపట్నం చెందిన గౌతమ్ ఆర్య 5 వెకెట్లు పడగొట్టారు. విశాఖపట్నం టీమ్‌ను స్టేడియం మేనేజర్ వెంప సుబ్రమణ్యం అభినందించారు.

## స్మిత సబర్వాల్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి



వెంకటగిరి, జులై 25 ప్రభాతవార్త : దివ్యాంగులను కించపరిచే విధంగా మాట్లాడిన అధికారిని స్మిత సబర్వాల్ క్షమాపణ చెప్పాలని దివ్యాంగులు డిమాండ్ చేశారు. పిడబ్ల్యుడి ఆధ్వర్యంలో ఇటీవల దివ్యాంగులను కించపరిచే విధంగా మాట్లాడిన అధికారిని స్మిత సబర్వాల్ క్షమాపణ చెప్పాల్సిందే అంటూ నల్ల రిబ్బన్‌తో పిడబ్ల్యుడి ఫెడరేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు జడపల్లి మురళి గౌడ్ డిమాండ్ చేశారు. వెంకటగిరి పిడబ్ల్యుడి ఫెడరేషన్ మహిళా అధ్యక్షురాలు రజిని మాట్లాడుతూ అత్యున్నత స్థాయి లో పదవిలో ఉండి ఇలాంటి అవాంఛనీయ మాటలు మాట్లాడం చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పిడబ్ల్యుడి సభ్యులు రమేష్, మాధవ్, రాజా, మురళి వీరభద్రయ్య, వెంకటసుబ్బయ్య, శ్రీను పాల్గొన్నారు.

## తీర ప్రాంత రైతులకు తెలుగు గంగ నీరు కల్పించండి

వాకాడు, జులై 25 ప్రభాతవార్త : వాకాడు మండలం నిడుగుర్తి రావిగుంటపాలెం, మూలపడవ, బురదగల్లి కొత్తపాలెం తీర ప్రాంత పంచాయితీలో దాదాపు 20 గ్రామాలు వర్షపు ఆధారపు నీటిపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. అయితే ఆ ప్రాంతపు నేలలో బోరు బావి వేసుకునే అవకాశాలు లేవు. ఆ భూపార అధిక లవణీత (ఉప్పు కలిగి) ఉంది. అక్కడ రైతులు వ్యవసాయానికి వర్షాధారపు నీటిపై ఆధార పడక తప్పదు. ఈ రుతుపుల్లో స్వల్ప కాల వర్షాల వలన సరిపడ నీరు ఆరు మాసాలకు వ్యవసాయం పండించుకను నీరు సమృద్ధిగా ఉండకపోవటం వలన, ఆశించిన మొత్తంలో దిగుబడి లేక, పెట్టుబడుల కోసం దళారుల దగ్గర వడ్డీలకు తెచ్చిన అప్పు తీర్చుకోలేక చిన్న సన్నకారు రైతులు అప్పుల పాలు కాక తప్పట్లేదు. ఇటువంటి సమస్యలు అధిగమించడానికి సమీప ప్రాంతంలో రైతులకు జీవనాధారంగా తెలుగు గంగ కాలువ సమీపంలో చిట్టమూరు, మల్లాం ప్రాంతం మీదుగా, రావిగుంట పాలెం సమీప ప్రాంతాలలో ప్రవహిస్తున్న బండ్ల రేవు మీదుగా బకింగ్ కెనాల్ (ఉప్పు కాలువ)లో వృథాగా నీరు కలుస్తుంది. తెలుగు గంగ నీరు కాలువ రూపంలో సమీప దగ్గరలో ఉన్న చెరువులకు నీరు వచ్చే వెసులుబాటు కల్పిస్తే దాదాపు 20 గ్రామాల రైతులకు వేల ఎకరాలకు ప్రయోజనం, చిన్నా సన్నకారు రైతులు జీవనాధార పరిశ్రమ వ్యవసాయం అభివృద్ధి కాగలవు దీనిపై గూడూరు శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ దృష్టి సారించి ఉన్నత స్థాయి అధికారులతో చర్చించి వెంటనే పనులు జరిగేలా చర్యలు తీసుకుంటారని తీర ప్రాంత రైతులు కోరుకుంటున్నారు.

## డ్రోన్ స్ప్రేయింగ్‌ను సద్వినియోగం చేసుకోండి : ఎడి



దొరవారిసత్రం జూలై 25 ప్రభాతవార్త ; గ్రామాల్లో వ్యవసాయసాగు చేస్తున్న రైతులు డ్రోన్ స్ప్రేయింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూళ్ళూరుపేట వ్యవసాయశాఖ ఎడి అనిత తెలిపారు. మండలంలోని తల్లంపాడు గ్రామంలో చేపట్టిన డ్రోన్ స్ప్రేయింగ్‌ను ఆమె గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా సూళ్ళూరుపేట ఎడి అనిత మాట్లడుతూ కోట మండలం గూడలి గ్రామానికి చెందిన ఎ చాంము ఒడేశ్వరరెడ్డి గత ఏడాది వ్యవసాయశాఖ ద్వార డ్రోన్ ఫైలెట్ ట్రైనింగ్ తీసుకొని లైసెన్స్ పొందారు. ఆయన ఇక్కడకు చేరుకొని డ్రోన్‌తో స్ప్రేయింగ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎవో జ్యోతి, ఎమ్ఎఒ. విఎఎలు, రైతులు తదితరులు ఉన్నారు.

## ఆడికృతికకు ముస్తాబైన ఎట్టేరి కొండ

గంగాధర నెల్లూరు జూలై 25 ప్రభాతవార్త: మండల పరిధిలోని ఎట్టేరి కొండపై వెలసియున్న శ్రీ వల్లిదేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయాన్ని ఆడికృతిక సందర్భంగా సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దారు. 26వ తేదీ ఆదివారం భరణి కావడి చెల్లింపులు 29వ తేదీ సోమవారం ఆడి కృతిక ఉదయం స్వామివారికిపాలాభిషేకం అర్చనలు నిర్వహించి, 30వ తేది మంగళవారం మధ్యాహ్నం సుబ్రమణేశ్వర స్వామి వల్లిదేవసేన అమ్మవార్లకు కళ్యాణోత్సవాన్ని ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించిన సాయంత్రం తెప్పోత్సవంతో ఈ ఉత్సవాలు ముగియనున్నట్లునిర్వహకులు తెలిపారు.

## చంద్రబాబు పాలనలో యువత..మహిళలకు స్వర్ణయుగం

**- సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి**



రామకుప్పం, జూలై 25 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబు పాలనలో యువత, మహిళలకు స్వర్ణయుగం రానుందని సిఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. గురువారం రామకుప్పం, ఆవులకుప్పం, నారాయణ పురం తాండా, ఆరిమానుపెంట, వీర్నమల గ్రామాల్లో నారా భువనేశ్వరి సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఆమె ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో నేతలు తమ జేబులు నింపుకునేందుకే సమయం కేటాయించారన్నారు. నమ్మి ఓట్లేసిన ప్రజలకు ద్రోహం చేశారన్నారు. అందుకే ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించారన్నారు. 2024 ఎన్నికలు స్వాతంత్ర్య సంగ్రామాన్ని తలపించాయన్నారు. రాష్ట్ర ప్రజలు ఓటు అనే ఆయుధంతో రాక్షస పాలన అంతం చేశారన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని సిఎం చంద్రబాబు అమలు చేస్తామన్నారు. తమకు పదవులు, అధికారం శాశ్వతం కాదని ప్రజల ప్రేమాభిమానాలు, ప్రజల సంక్షేమం, అభివృద్ధి తమకు ముఖ్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటారన్నారు. రామకుప్పంలో 8.5కోట్లతో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ రైతులకు కానుకగా అందిస్తున్నారన్నారు. తమ కుటుంబం కుప్పం ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అంతకుముందు గ్రామాల్లో నారా భువనమ్మకు ప్రజలు, మహిళలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమాలో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత డా॥ సురేష్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు మునస్వామి, ఆంజనేయరెడ్డి, నరసింహులు, పత్ర నారాయణ,రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సహకారమిస్తే పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతా...!

**-ముఖ్యమంత్రిని కోరిన ఎస్కేఆర్**



చౌడేపల్లి, జూలై 25 ప్రభాతవార్త : పుంగనూరు నియోజకవర్గంలో పలు ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును బోయకొండ మాజీ ఛేర్మన్ ఎస్కె వెంకట్రమణారెడ్డి కోరినట్లు తెలిపారు. అమరావతిలోని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి నివాసంలో ఎస్కేఆర్ కలుసుకొన్నారు. సనాతనధర్మ పరిరక్షణలో భాగంగా పురాతన దేవాలయాల పునర్నిర్మాణం, పేద, బడుగు, బలహీనవర్గాలకు సామూహిక వివాహాలు వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించానన్నారు. శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయం, దక్షిణకాశీ అగస్తీశ్వర స్వామి ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా చేసేందుకు తన సొంత నిధులు వెచ్చిస్తాననీ, సహకరించాలని కోరగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించి, సంపూర్ణ మద్దత్తు వుంటుందని తెలిపి అభినందించినట్లు ఎస్కేఆర్ వివరించారు. అదే విధంగా చౌడేపల్లి తదితర ప్రాంతాల్లో దేవాలయాల నిర్మాణంలో తాను పడ్డ కష్టాలు, ఎదుర్కొన్న పోలీసు కేసులను గురించి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ళగా, ఇక అంతా మంచే జరుగుతుందన్న ధీమా ఇచ్చారని ఎస్కేఆర్ తెలిపారు.

## పాత కలెక్టరేట్‌లో రికార్డు రూమ్ తనిఖీ చేసిన డిఆర్ఓ



చిత్తూరు, జులై 25 ప్రభాతవార్త: చిత్తూరు గిరింపేటలోని పాత కలెక్టరేట్‌లోని రికార్డు రూమ్‌ను గురువారం సాయంత్రం డిఆర్ఓ పుల్లయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఆర్ఓ పుల్లయ్య మట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి పాత రికార్డులు భద్రపరచిన రికార్డు రూమ్ పరిసరాల్లో భద్రతాపరంగా సిసి కెమెరాలు, పోలీసులతో సెక్యూరిటీ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే డిఆర్ఓ పుల్లయ్య పాత కలెక్టరేట్ ఆవరణలో వున్న చుడా కార్యాలయం, ట్రెజరీ కార్యాలయాల రూములను పరిశీలించారు.

**క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం సమస్యలు పరిష్కారం :**

సిఎం నారా చంద్రబాబునాయుడు కుప్పం పర్యటన సందర్భంగా నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్ళి పరిశీలించి ఆపై సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో గురువారం డిఆర్ఓ పుల్లయ్య సిఎం పర్యటన సందర్భంగా ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీల పరిష్కారంపై తీసుకుంటున్న చర్యలపై డ్వామా పిడి రాజశేఖర్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో అడ్మిన్ ఎఎస్పీ ఆరీఫుల్లా, జడ్పీ సిఇఓ గ్లోరియా, పిఆర్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్అండ్‌బి ఎస్ఇ ఉమామహేశ్వర్‌రెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రభావతిదేవి, డిఎల్‌డిఎ రవికుమార్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

దొరవారిసత్రం జాలై 25 ప్రభాతవార్త; మండలంలోని విఎంఆర్ నగర్ సమీపంలో జాతీయ రహదారిపై లారీ ఢీకొని యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాలు మేరకు భూదురు గ్రామానికి చెందిన వాసు మోటార్‌సైకిల్‌పై సూళ్ళూరుపేటకు వెళ్లి పనులు పూర్తిచేసుకొని తిరిగి స్వగ్రామమైన భూదురుకు వస్తుండగా మార్గమధ్యలో దొరవారిసత్రం మండల విఎంఆర్ నగర్ వద్దకు వచ్చేసరికి అదే మార్గంలో వెనుక నుండి వస్తున్న లారీ ప్రమాదవశాత్తు మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. దీంతో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న వాసు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108సహాయంతో చికిత్సనిమిత్తం సూళ్ళూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దొరవారిసత్రం పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వైభవంగా ముగిసిన శ్రీ ఎల్లమ్మతల్లి జాతర

రేణిగుంట, జూలై 25 ప్రభాతవార్త: రేణిగుంట పట్టణ శివారు సీబీఐడీ కాలనీకి వెళ్లే మార్గంలో కొలువుతీరిన శ్రీ ఎల్లమ్మతల్లి జాతరలో భాగంగా అమ్మవారి ఊరేగింపు బుధవారం మధ్యాహ్నం దేవాలయం నుంచి ప్రారంభమై గురువారం వేకువ జామున వరకు సాగింది. భక్తులు అమ్మవారి రాక కోసం ఎదురుచూసి అమ్మతల్లి ఊరేగింపు తమ వీధిలోకి రాగానే నారికేళాది ఫలాలు అర్పించి కర్పూర నీరాజనాలు సమర్పించారు. అమ్మవారు అన్ని వీధుల్లో ఊరేగిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు ఆలయ శాశ్వత ధర్మకర్త దాముస్వామి సతీమణి సరసమ్మ, కుమారుడు ఏళుమలైరెడ్డి ప్రసాదాలను పంపిణీ చేశారు. మేళతాళాలు, కోలాటాలు మధ్య అమ్మవారి ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## పట్టాభిరామశాస్త్రీ వ్యాఖ్యానమాల ప్రారంభోత్సవం



తిరుపతి విద్య, జులై 25 ప్రభాతవార్త : సంస్కృత వర్సిటీలో మహామహోపాధ్యాయ పట్టాభిరామశాస్త్రి వ్యాఖ్యానమాల ప్రారంభోత్సవం చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వేదభారతి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొ. ఆర్‌వివి అవధానులు విచ్చేసి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తితోకలిసి జ్యోతి ప్రజ్వలన చేసారు. సీడాక్, బెంగళూరు బృందం ఇన్చార్జి డా. ఎస్‌బి సుదర్శన్ మాట్లాడుతూ ఆధునిక యుగంలో టెక్నాలజీ ద్వారా శాస్త్రజ్ఞానాన్ని ఆధునిక తరంగానికి అందించడం ఎంతో ముఖ్యమని వివరించారు. అనంతరం సభాధ్యక్షులు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొ. జిఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ పట్టాభిరామశాస్త్రి వ్యాఖ్యానమాల ద్వారా శాస్త్రాల్లో ఉన్నటువంటి అనేక వైజ్ఞానిక అంశాలను ఆధునిక టెక్నాలజీతో కలిపి విద్యార్థులకు వివరించాలనేటువంటి లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలు గత కొన్ని సంవత్సరాలుగా విశ్వవిద్యాలయం చేయడం జరుగుతుందని వివరించారు. అందులో భాగంగానే ఈ రోజు 2024 సంవత్సరానికి ఈ పట్టాభి రామశాస్త్రి వ్యాఖ్యానమాల ప్రారంభించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్ల, ఈ కార్యక్రమం కోఆర్డినేటర్ దర్శన డీన్ ప్రొ. విష్ణుభట్టాచర్యులు, అడిషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఓపిజి కళ్యాణ్ శాస్త్రి, విశ్వవిద్యాలయంలోని భిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు రీసెర్చ్ కలర్స్ పాల్గొన్నారు.

## వెండి పల్లకిలో సుబ్రమణ్యం స్వామి గ్రామోత్సవం



శ్రీకాళహస్తి, జూలై 25 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న చెంగల్వరాయస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ధ్వజారోహణ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయం ఎదురుగా కార్యక్రమాలకు ముందు వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామిని అలంకార మండపంలో చక్కగా ముస్తాబు చేసారు. ఆలయ డెప్యూటీ ఇఓ ఎస్ ఆర్ కృష్ణారెడ్డి, ఎసి మల్లికార్జున్ ప్రసాద్, ఆలయ ఎఇఓ లోకేష్‌రెడ్డి, ఇన్స్పెక్టర్ హరియాదవ్, దఫేదార్ రాజా వెంటరాగా గ్రామోత్సవం మేళ తాళాలు మంగళవాయిద్యాలతో సాగింది. ఈ ఉత్సవంతో పట్టణ ప్రజలకు ఆడికృత్తిక మహోత్సవాలు సంకేతం. వెండిపల్లకిలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గ్రామోత్స వం తరువాత ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు.

## సివిల్ కేసులో జోక్యం...భాకరాపేట ఎస్ఐ విఆర్‌కు

భాకరాపేట, జులై 25ప్రభాతవార్త: పోలీసుశాఖ క్రమశిక్షణను ఉల్లంఘించి, చట్టానికి అతీతుడై సివిల్ కేసులో జోక్యం చేసుకున్న భాకరాపేట ఎస్ఐ ఆర్.విజయకుమార్‌నాయక్‌ను విఆర్‌కు పంపారు. జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతేగాక అతనిపై తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. క్రమశిక్షణతో విధివిధానాలు పాటిస్తూ స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, అదే సమయంలో చట్టప్రకారం మన పరిధి దాటకూడదని చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

## చక..చకా సిద్ధమవుతున్న 'అన్నా' క్యాంటీన్లు

**-వచ్చేనెల నుంచి ప్రారంభం**



శ్రీకాళహస్తి, జూలై 25 ప్రభాతవార్త : నిరుపేదలకు రూ.5కే టిఫిన్, భోజనం పెట్టి వారి ఆకలితీర్చే అన్నా క్యాంటీన్లు గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే ప్రభుత్వం మారడంతో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నా క్యాంటీన్లను మూసివేసి వాటిని సచివాలయకు కేటాయించారు. పట్టణంలో రెండు అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసిన వైనం తెలిసిందే. ఒకటి ఏరియా ఆస్పత్రి మార్గంలోను, మరొకటి రామసేతువంతెన వద్ద ఏర్పాటు చేశారు. ఏరియా ఆస్పత్రి వద్ద రూ.48లక్షలతో నిర్మించిన అన్నా క్యాంటీన్‌ను గత తెలుగుదేశం ప్రభుత్వ హయంలో అప్పటి ఎంఎల్‌ఏగా ఉన్న స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఉదయం, సాయంత్రం నిరుపేదలు, ఆటో డ్రైవర్లుతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎంతో ఉపయోగంగా ఉండేది. ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పట్టణంలో ఉన్న రెండు అన్నా క్యాంటీన్లను సిద్ధం చేస్తున్నారు. మరమ్మత్తులకు ఒక్కొక్క అన్నా క్యాంటీన్‌కు రూ.9.50లక్షలుతో మరమ్మత్తులు చేసి ఆగస్టు 15న ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే పనులు చక చకా.. జరుగుతున్నాయి. ఏరియా ఆస్పత్రి వద్ద ఉన్న అన్నా క్యాంటీన్‌మరమ్మత్తులు చేపడుతున్న సందర్భంగా లోపల విద్యుత్ సరఫరా కోసం ఉంచిన వైర్లు చోరీ జరిగాయి. అన్నా క్యాంటీన్లు ప్రారంభించిన తర్వాత ఇక్కడ రాత్రివేళల్లో వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఉత్సవాలు ఊర్లో -అధికారులు కార్యాలయాల్లో!



ఆడి కృతిక శోభ కానరాని కుమారస్వామి ఆలయం

శ్రీకాళహస్తి, జూలై 25 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారుల తీరు రోజు రోజుకు తీసికట్టుగా మారుతుంది. ఇక్కడి అధికారులు కేవలం నాలుగు గోడల మధ్య ఎసి గదుల్లో ఫైళ్ళపై సంతకాలకే పరిమిత మౌతున్నారు. ఇక్కడ రెగ్యూలర్ ఇఓలు ఉండటం లేదు. ఫుల్ అడిషనల్ చార్జి ఇఓలే ఎక్కువ భాగం పరిపాలిస్తున్నారు. ఇక ఇంజనీరింగ్‌శాఖ పని తీసు పరిశీలిస్తే ఆగమ్యగోచరంగా మారింది. గతంలో చేపట్టిన పనులు ఎక్కడికక్కడే ఆగినాయి. వాటి పరిస్థితి ఏమిటో ఎవ్వరికి అంతుపట్టడం లేదు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి ద్రౌపదీసమేత ధర్మరాజుల బ్రహ్మోత్సవాలు, ఆడికృత్తిక మహోత్సవాలు, దుర్గాంబకొండపై నవరాత్రి ఉత్సవాలు, ముత్యాలమ్మ జాతర, సమీప గ్రామాల్లోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు గ్రామస్థులతో ముడిపడి నడుస్తాయి.

**ఎంఎల్ఏ సమావేశాల్లో, అధికారులు కార్యాలయాల్లో:**

సాధారణంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలోని ఉత్సవాల పర్యవేక్షణ ధర్మకర్తల మండలి ఉంటే వారు పర్యవేక్షించే వారు. లేకుంటే శాసనసభ్యుడే పర్యవేక్షించే వారు. ఈ సారి జరిగిన ధర్మరాజు స్వామి బ్రహ్మోత్సవాల్లో అధికారుల పర్యవేక్షణ లేదనే చెప్పాలి. సాధారణంగా అయితే ధర్మకర్తల మండలి నాయకులు, అధికారులు వేర్వేరుగా పర్యవేక్షించే వారు. కానీ ఈ సారి ఆ పర్యవేక్షణ అంశమే లేదు. ఇక ఈ నెల 28 నుంచి ఆడికృత్తిక ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఇప్పటికే సంబరాలు ప్రారంభం కావాలి. ఈ ఉత్సవాల్లో తెప్పోత్సవం కూడా ఉంది. ఈ ఉత్సవాలకు వేలాది మంది హాజరౌతారు. నారద పుష్కరిణిలో నిర్వహిస్తారు. కానీ కోనేరులో నీరు లేదు. పైపులతో నింపుతున్నారు. ఇక ఏర్పాట్లు పనులు జరుగుతున్నాయి. కానీ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ కరువైంది. గతంలో వివిధ శాఖల అధికారులతో ఎంఎల్ఏ సమీక్షించే వారు. ఈ ఏడాది అలాంటి సమీక్షలే కరువయ్యాయి. ఇక్కడి ఆలయ ఇఓగా తిరుపతి ఆర్‌జెసి ఫుల్ అడిషనల్ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. కానీ ఆయన కూడా ఒక్క ఉత్సవానికి సంబంధించి ఏర్పాట్లనుకూడా పర్యవేక్షించిన దాఖలాలు లేదు. సమీక్షలు లేదు. పర్యవేక్షణలు లేదు. దాంతో ఉత్సవాల విజయం 'దైవాదీనంగా' మారింది. గతం లోపాలకులు తరచూ పర్యవేక్షించుకునే వారు. కానీ ఈ ఏడాది ఉత్సవాలు శివయ్య దయాదాక్షిణ్యాల మీద సాగుతున్నాయి. ప్రస్తుతం ఉత్సవాలు జరుగుతున్న కుమారస్వామి కొండ వద్ద దిగువన ఉన్న పురాతన కాలం నాటి వినాయక మండపాన్ని కూల్చి కొత్త నిర్మాణం చేపట్టుటకు నిర్ణయించారు. అలాగే ఆలయ చుట్టూ అభివృద్ధికి సంబంధించిన పనులు జరుగుతున్నాయి. ఉత్సవాల వస్తున్నా పర్యవేక్షించిన దిక్కులేదు.

## ఆగస్టు 2 నుంచి ద్రౌపతిదేవి ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాలు



నారాయణవనం, జూలై 25 ప్రభాతవార్త : మండలకేంద్రంలోని నారాయణవనంలో ప్రసిద్ధి చెందిన ద్రౌపతిదేవి సమేత ధర్మరాజులస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆగస్టు 2వ వతేది నుంచి 11వతేది వరకు జరుగుతుందని ఆలయ ధర్మకర్త దేశప్పరెడ్డి తెలిపారు. ఆగస్టు 2వతేది శుక్రవారం సాయంత్రం 5గంటలకు ధ్వజారోహణం, 3,4,5వతేదీల్లో సప్రవాహనాలపై నాగిలేరు, ఎరికంబట్టు, తిరువట్యం గ్రామాల్లో ఊరేగింపు, 6వతేది మంగళవారం అశ్వవాహనం, నిర్చితార్థం, రాత్రి కల్యాణోత్సవం, 7వతేది బుధవారం రెడ్డివీధి ఊరేగింపు, సాయంత్రం ఒడియార్ ఉత్సవం, 8వతేది గురువారం శడగోప్రమహోత్సవం, 9వతేది శుక్రవారం అర్జునతపస్సు, సాయంత్రం భాణసంచావేడుకలు (వాణి వైశ్యుల సంఘం), 10వతేది శనివారం అలుగు ఉత్సవం, రాత్రి గరుడసేవ, 11వతేది ఆదివారం సాయంత్రం అగ్నిగుండం, రాత్రి సింహావాహనంపై ఊరేగింపు, 12వతేది పట్టాభిషేకం, ధ్వజ అవరోహనంతో ముగుస్తుందన్నారు. ఈసందర్భంగా ఆలయానికి రంగులు కొడుతున్నట్టు చెప్పారు. ఈనెల 2నుంచి11వతేది వరకు తిరుపతికి చెందిన ఎం.పూర్ణ మహాభారతం చెబుతుందన్నారు. ఈనెల 6నుంచి10వ తేది వరకు రాత్రి పూట వీధినాటకం నిర్వహించడం జరుగుతుందన్నారు. అగ్నిగుండ ప్రవేశం చేసే భక్తులు 150 రూపాయాలను కంకణంగా చెల్లించాలన్నారు.

# ఎర్రచందనం స్మగ్లర్ల నిరోధానికి కఠిన చర్యలు

**టాస్క్‌ఫోర్స్ ఇన్చార్జి ఎస్పీ సుబ్బరాయుడు**



ఎర్రచందనం దుంగలను పరిశీలిస్తున్న ఎస్ఐ

తిరుపతి కార్పొరేషన్, జులై 25 ప్రభాతవార్త : శేషాచలం అడవుల్లోకి ప్రవేశిస్తున్న ఎర్రచందనం స్మగ్లర్లను నిరోధించడానికి కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ ఇన్చార్జి తిరుపతి జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు తెఇపారు. దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోవడంపై ఆయన గురువారం కపిలతీర్థం సమీపంలోని టాస్క్‌ఫోర్సు కార్యాలయాన్ని సందర్శించారు. టాస్క్‌ఫోర్సు ఎస్పి పి. శ్రీనివాస్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అధికారులతో సమావేశమైన ఎస్పీ టాస్క్‌ఫోర్సు పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆపరేషనల్ టీమ్‌లతో అభిప్రాయ సేకరణ చేసి, ఆపరేషన్ విధానాలను తెలుసుకున్నారు. సమాచారం పొందే విధానం నుంచి స్మగ్లర్లను పట్టుకోవడానికి తీసుకుంటున్న చర్యలను ఆపరేషనల్ టీమ్స్ వివరించారు. స్మగ్లర్లను నిరోధించడానికి మరిన్ని వ్యూహాలను చేపట్టాల్సి ఉందని సూచించారు. ఇప్పటి వరకు టీమ్స్ చేపడుతున్న చర్యలను అభినందిస్తూ, మరింత ముందుకు వెళ్లడానికి తీసుకోవాల్సిన విధానాల గురించి సూచనలు చేశారు. ప్రతి అధికారి చేపడుతున్న విధులను తెలుసు కుని, వారికి సూచనలు అందజేశారు. ముఖ్యంగా అడవుల్లోకి వెళ్ళిన ప్పుడు ఉపయోగిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సాంకేతికంగా చేపడుతున్న సమాచారం వ్యవస్థ గురించి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఆయనకు కడప, రైల్వే కోడూరు, సానిపాయ సబ్ కంట్రోల్‌ల నుంచి జరుగుతున్న ఆపరేషన్ విధానాలను టాస్క్ ఫోర్సు ఎస్పి పి. శ్రీనివాస్ వివరించారు. బేస్ క్యాంపులు, ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్ల గురించి తెలియజేశారు. తరువాత టాస్క్‌ఫోర్సు ఆవరణం లోని కంట్రోల్ రూమ్, పోలీస్ స్టేషన్, అకౌంట్స్ ఆఫీసు, రవాణా ఆఫీసు తదితర ప్రాంతాలను సందర్శించారు. అవసరమైతే తిరుపతి జిల్లా పోలీసు విభాగం సహకారం కూడా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి చెంచుబాబు, ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి, ఎసీఎఫ్ శ్రీనివాస్, సిఐలు శ్రీనివాసులు, సురేష్ కుమార్, ఎస్ఐ రఫీ, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.